ప్రజాశక్తి

బుధవారం 3 డిసెంబర్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

స్థలాల కొనుగోలుదారుల్లో అయోమయం

- తమ పరిస్థితి ఏమిటని మధ్యతరగతి వర్గాల్లో దిగులు, గుబులు
- రాజధాని విస్తరణకు 16,666 ఎకరాల సమీకరణకు ఉత్తర్వులు



పెదమద్దూరు వద్ద ఏర్పాటుచేసిన వెంచర్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధానికి సమీపంలోని గ్రామాల్లో సిఆర్‌డిఎ అనుమతి పొందిన, అనధికారికంగా నిర్మించిన వెంచర్లలో ప్లాట్లు కొనుగోలుదారులు అయోమయంలో చిక్కుకున్నారు. రాజధాని విస్తరణలో భాగంగా మలి విడత భూ సమీకరణకు సన్నద్ధమైన నేపథ్యంలో ఆయా గ్రామాల్లో వెంచర్లలో గజాల లెక్కల ప్లాట్లు కొనుగోలు చేసిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రాజధాని విస్తరణకు మలివిడతలో ఏడు గ్రామాల పరిధిలో 16,666 ఎకరాల సమీకరణకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆయాగ్రామాల్లో ఎక్కువ మంది రైతులు సమీకరణలో భూములు ఇచ్చేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు రైతులను ఒప్పిస్తున్నారు. వ్యవసాయంపై విసిగి వేసారని రైతులు ఎక్కువ మంది సమీకరణలో భూములు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. కానీ కొన్ని షరతులను తెరపైకి తెస్తున్నారు. అయితే వీటిని ప్రభుత్వం ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా 2015లో తొలి విడత సమీకరణలో రైతులకు ఇచ్చిన ప్యాకేజినే మలివిడత కూడా కొనసాగుతుందని ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే రాజధానికి పరిసర మండలాల్లో తాడికొండ, అమరావతి, పెదకూరపాడు మండలాలతో పాటు 2015లో మినహాయించిన పెదపరిమి, హరిశ్చంద్రపురం, వడ్డమాను గ్రామాల్లో నిర్మించిన వెంచర్లలో కొంత మంది గజాల లెక్కన ప్లాటు కొనుగోలు చేశారు. మలివిడత భూ సమీకరణలో ఈ వెంచర్లకు సంబంధించిన భూములను ప్రభుత్వం సమీకరణలో తీసుకుంటే తమ పరిస్థితి ఏమటని స్థలాలు కొనుగోలు చేసిన వారు గందరగోళంలో ఉన్నారు. తాము 200 గజాల స్థలం కొంటే ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజి ఎకరాకు వెయ్యి గజాల్లో తమకు ఎంత స్థలం వస్తుంది? దానికి ధర ఎంత పలుకుతుంది? అభివృద్ధి చేసి రిటర్నబుల్ ప్లాట్లు ఇచ్చేదెప్పుడు? ఇందులో తమ స్థలానికి రిటర్నబుల్ స్థలం ఎంత దక్కుతుంది? అనే ప్రశ్నలు స్థలాల కొనుగోలు దారులను వేధిస్తున్నాయి. వెంచర్లకు

2లో



రసాయనాల కారణంగా దాచేపల్లి మండలం తంగెడ వద్ద నదిలో కలుషితమై కనిపిస్తున్న నీరు..

తంగెడలో కాలుష్య కలవరం

మూలాలపై కొనసాగుతున్న అన్వేషణ - నీటిలో రసాయన తెప్పలపై విచారణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగెడ వద్ద కృష్ణానదిలో నీరు కలుషితం కావడం జిల్లా వాసులను కలవర పరుస్తోంది. పరిశ్రమల నుంచి వ్యర్థాలు కృష్ణా నదికి సంబంధించిన కాల్వల్లోకి మళ్లించడం వల్ల నీరు కాలుష్యమైందా? లేదా ఎవరైనా ఏమైనా పదార్థాలు కలిపారా? అనే కోణంలో విచారణ జరుగుతోంది. ప్రధానంగా నీరు ప్రవహించే ప్రాంతాలకు సంబంధిత గ్రామాలు, పట్టణాలకు చెందిన అధికారులను అప్రమత్తం చేశామని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీరు ఎం.వి.నజీనా బేగం తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అప్రమత్తం చేసి వెంటనే నీటి శ్యాంపిల్స్‌కు పంపి విచారణ చేయాలని ఆమె అన్నారు. తెలంగాణలోని సూర్యపేట నుంచి ఈ నీటి ప్రవాహం వస్తుందని, ఈ నీటిలో కాలుష్యం ఏర్పడిందని గుర్తించడం వల్ల తెలంగాణ ప్రభుత్వ అధికారులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. విద్రోహుల పని ఏమైనా ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేయాలని పోలీసులకు సమాచారం ఇచ్చారు.

తంగెడ వద్ద కష్ణా నదిలో

2లో



2లో

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్‌పి వకుల్ జిందాల్, ఇతర అధికారులు

డ్రగ్స్, గంజాయి వినియోగాన్ని అరికట్టండి : కలెక్టర్

ప్రత్తిపాడు జెడ్‌పి పాఠశాలలో మంటలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు: స్థానిక బివిఆర్ జెడ్‌పి పాఠశాలలో మంగళవారం అకస్మాత్తుగా మంటలు చేలరేగి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉలిక్కిపడ్డారు. పాడైన ఫర్నీచర్, ఫైళ్ల ఉన్న పాఠశాలలో పాత బడిన భవనంలో నుండి మధ్యాహ్నం 3 గంటలప్పుడు ఒక్కసారిగా మంటలు, పొగ చెలరేగడం, గది రేకులు పగిలి పెద్ద శబ్దాలు రావడంతో విద్యార్థులను ఉపాధ్యాయులు వెంటనే బయటకు పంపించి అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోగా ప్రైవేటు నీటి ట్యాంకర్ ద్వారా మంటలను అదుపు చేశారు. అనంతరం వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.





2లో

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

భూములిస్తాం..కానీ..

రాజధానికి రెండవ విడత భూ సమీకరణపై రైతుల్లో భిన్నాభిప్రాయాలు

ప్రజాశక్తి - తుళ్లూరు

భూములిస్తాం.. కానీ.. పదేళ్ల క్రితం తొలి విడత భూ సమీకరణలో ఇచ్చిన విధంగా కాకుండా ప్యాకేజీ, కౌలు పెంచాలి.. ప్లాట్ల కేటాయింపులో జాప్యం ఉండకూడదు.. రాజధాని నిర్మాణంలో భాగంగా మా ప్రాంతానికి కొన్ని ప్రాజెక్టులు మంజూరు చేస్తామనే హామీఇవ్వాలి.. అమరావతే రాష్ట్ర ఏకైక రాజధానని గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొనాలి..

రాజధాని నిర్మాణం విస్తరణలో భాగంగా రెండో విడత భూ సమీకరణలో మండలంలోని పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురం గ్రామాల్లోని వ్యవసాయ భూములను తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొద్దినెలల క్రితమే రెండవ విడత భూసమీకరణకు ప్రభుత్వం ప్రయత్నించింది. అందులో భాగంగా గత మే 13న హరిశ్చంద్రపురం, 14న వడ్డమాను, పెదపరిమిలో ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. రైతుల నుంచి పూర్తి స్థాయిలో అనుకూలత వ్యక్తం కాకపోవడంతో మరోసారి సభలు పెడదామని అప్పట్లో ఎమ్మెల్యే చెప్పారు. తాజాగా రాజధాని విస్తరణ పేరుతో మరోసారి భూసమీకరణ తప్పదంటూ తాజాగా ప్రభుత్వం రెండవ విడతలో 16,666 ఎకరాలను తీసుకోవాలని నిర్ణయాని కొచ్చింది. మండలంలోని పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురంతో పాటు అమరావతి మండలంలో నాలుగు గ్రామాల నుంచి భూముల సమీకరణ జరగనుంది. ఈ నేపథ్యంలో రైతుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది రైతులు భూములు ఇచ్చేదిలేదని అంటుండగా, కొంతమంది ఆచితూచి మాట్లాడుతున్నారు. మరి కొంతమంది 'భూములివ్వాలని మాదగ్గరకు ఎవరూ రాలేదు.. వచ్చినప్పుడు చెబుతామని.. అంటున్నారు. ఇంకొందరు అభిప్రాయం చెప్పేందుకు జంకుతుండగా, మరికొందరు భూములిస్తామంటూనే కొన్ని డిమాండ్లను ముందుకు తెస్తున్నారు.

ఇదీ రైతుల మాట..



రోడ్లు, ఇతర నిర్మాణాలకు అవసరమైనంత వరకే భూములు తీసుకోవాలి. తీసుకున్న భూముల ధర నిర్ణయించి చెల్లించాలి. ల్యాండ్ పూలింగ్‌లో భూములిస్తే ఇబ్బందే..

- భీమన వెంకట నారాయణరావు, వడ్డమాను.



1500 గజాలు ప్యాకేజి ఇవ్వాలని కొంతమంది రైతులం అనుకుంటున్నాం. ప్యాకేజి పెంపుతో పాటు కౌలుపెంచి ఇవ్వాలి..

- చల్లా శ్రీనివాసరెడ్డి, వడ్డమాను.



అన్ని రెవెన్యూలలో కంటే మా గ్రామంలో వ్యవసాయ భూములెక్కువ. ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. త్వరితగతిన ప్లాట్లు ఇవ్వాలి. కౌలు పెంచాలి. రాజధాని అభివృద్ధి వేగంగా జరిగేలా చూడాలి..

- కర్నాటి శ్రీనివాసరావు, పెదపరిమి.



నాకు నాలుగెకరాలు పొలం ఉంది. పిల్లలకు పంచగా ఎకరం మిగిలింది. ప్లాట్లు మెరకు ప్రాంతంలో జాప్యం లేకుండా కేటాయించి వాటిపై బ్యాంకుల్లో రుణ సౌకర్యం కల్పించాలి.**- బుర్రా హనుమారెడ్డి, వడ్డమాను.**



రైతులు సుముఖుంగానే ఉన్నారు. గతంలో ప్రభుత్వం మారాక రాజధాని రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా రాజధాని మార్చకుండా చట్టం చేయాలి..

- భీమన సాంబశివరావు, వడ్డమాను.



కాలుష్య నియంత్రణపై ఈశ్వర్ ఇంజినీరింగ్‌లో సదస్సు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఐఐసి, ఎన్ఎస్ఎస్ యూనిట్‌ల సహకారంతో జాతీయ కాలుష్య నియంత్రణపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సూళ్లూరుపేట ఇంటిగ్రేటెడ్ రూరల్ – అర్బన్ డెవలప్మెంట్ సొసైటీకి చెందిన గీతిక వెంకటేషన్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడడం అందరి బాధ్యతన్నారు. కాలుష్యాన్ని నియంత్రించాలంటే స్వచ్ఛ భారత్ కార్యక్రమంతో పాటు, రోజువారి దినచర్యల్లో జరిగే భూమి కాలుష్యం, నీటి కాలుష్యం మరియు మితిమీరిన ప్లాస్టిక్ వాడకం నుండి ప్రజల ఆలోచనలను మళ్లించాలని చెప్పారు. ఇందుకు తమ సంస్థ పని కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీం మోహిద్దీన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ షేక్.మస్తాన్ షరీఫ్, ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు, ఐఐసి కన్వీనర్ డాక్టర్ షేక్. ముజీర్ పాల్గొన్నారు.

అయోమయం

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన భూములకు మినహాయింపు ఇవ్వడం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు.

అయితే సిఆర్‌డిఎ పరిధిలో నిర్మించిన పలు వెంచర్లకు అనుమతులు ఉన్నాయి. సిఆర్‌డిఎ పరిధిలోని గ్రామాల్లో అనుమతి పొందిన వెంచర్లు దాదాపు 150 వరకు ఉన్నాయి. ఏడు గ్రామాల పరిధిలో దాదాపు 20 వరకు వెంచర్లు ఉన్నాయి. వీటిల్లో స్థలాలు కొనుగోలు చేసిన వారు వెయ్యి మంది వరకు ఉన్నారు. వీరి పరిస్థితిపై ఇంకా నిర్ణయం వెలువలేదు. తొలుత 44 వేల ఎకరాల్లో మలివిడత భూ సమీకరణ చేయాలని నిర్ణయం తీసుకున్నా ఇటీవల 34 వేల ఎకరాల సమీకరణకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందులో తొలి విడత 16,666 ఎకరాల పట్టాభూమి, ప్రభుత్వ అసైన్డ్ భూములు 3,828 ఎకరాలు కలిపి మొత్తంగా 20,494 ఎకరాలు సిఆర్‌డిఎ భూ సమీకరణ చేయనుంది. తుళ్లూరు మండలంలో మొదటి విడత సమీకరణ నుంచి మినహాయించిన వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమి గ్రామాలతో అమరావతి మండలం మరో నాలుగు గ్రామాలను ఎంపిక చేశారు. అమరావతి మండలం వైకుంఠపురంలో 3,361 ఎకరాలు, పెదమద్దూరులో 1,145 ఎకరాలు, ఎండ్రాయిలో 2,166 ఎకరాలు, కర్లపూడిలో 2,944 ఎకరాలు తీసుకోనున్నారు. తుళ్లూరు మండలం వడ్డమానులో 1,913 ఎకరాలు, హరిశ్చంద్రపురంలో 2,418 ఎకరాలు, పెదపరిమిలో 6,513 ఎకరాలు కలిపి మొత్తం 20,494 ఎకరాలు సిఆర్‌డిఎ త్వరలో తమ అధీనంలోకి తీసుకోనుంది.

తంగెడలో కాలుష్య కలవరం

(మొదటి పేజీ తరువాయి)

తెలుతున్న కాలుష్య తెప్పల శాంపిల్స్‌ను సేకరించామని దాచేపల్లి తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, మైనింగ్ ఎడి ప్రకాష్ కుమార్ తెలిపారు. నదిని సందర్శించిన వారు ఇది రసాయనాల వల్లేనని ప్రాథమికంగా తెలుస్తోందని, అయితే ఎక్కడి నుండి వచ్చిందో పోలీసుల సహకారంతో దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీల సిబ్బందిని కూడా పిలిపించి వారు ఏమైనా ఇక్కడ వ్యర్థాలను డంప్ చేశారా అని విచారణ చేస్తామని తహశీల్దార్ శ్రీనివాస యాదవ్ చెప్పారు. నివేదిక వచ్చాక కలెక్టర్ ఆదేశాల మేరకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వ్యర్థాలను తొలగించి నీటిని శుద్ధి చేసి తంగేడ గ్రామస్తులకు త్వరలోనే నీటిని అందజేస్తామని తెలిపారు. అప్పటివరకు గ్రామంలో ఇతర వనరుల ద్వారా నీటిని అందిస్తున్నామని తెలిపారు. ఇదిలా ఉండగా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని కెమికల్ కంపెనీలు వ్యర్థాలనేమైనా వేశారా? అని గ్రామస్తులు అనుమానిస్తున్నారు.

డ్రగ్స్, గంజాయి వినియోగాన్ని అరికట్టండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాదక ద్రవ్యాల వినియోగాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించాలని, వీటికి విద్యార్థులు ఆకర్షితులు కాకుండా నిరోధించాలని అధికారులను గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. జిల్లా మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించారు. అధ్యక్షత వహించిన కలెక్టర్ మాట్లాడుతూ విద్యాసంస్థలు, హాస్టళ్లలో నిరంతర పర్యవేక్షించాలని, మాదక ద్రవ్యాలకు ఆకర్షితులవుతున్న విద్యార్థులను ప్రారంభ దశలోనే గుర్తించాలని ఆదేశించారు. అలవాటు పడుతున్న యువతకు తగిన కౌన్సిలింగ్, సైకాలజికల్ సపోర్ట్ డీ-అడిక్షన్ సెంటర్లలో చికిత్స అందేలా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పాఠశాలలు, కళాశాలల్లో ఏర్పడిన ఈగల్ క్లబ్బుల నోడల్ అధికారుల వివరాలు పోలీస్ శాఖకు పంపించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈగల్ క్లబ్బుల ద్వారా విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వాటి నివేదికలను తదుపరి సమావేశానికి అందించాలని సూచించారు. మత్తు, వైద్య మందుల విక్రయంలో డ్రగ్ కంట్రోల్ శాఖ నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, మాదక ద్రవ్యాల హానికర ప్రభావాలపై విద్యార్థులు, యువతకు ప్రచారం చేయాలని చెప్పారు. మత్తు లేదా మాదక ద్రవ్యాల రవాణా, వినియోగం, తయారీ, సరఫరా వంటి సమాచారం ఎక్కడైనా కనిపించిన వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఈగల్ టీమ్ సమన్వయంతో పటిష్ఠ చర్యలు కొనసాగిస్తున్నామని తెలిపారు. నవంబర్ 1 నుండి 28 వరకు 12 కేసులు నమోదు చేసి, 42 మందిని అరెస్టు చేసి, ఒక వాహనాన్ని సీజ్ చేసినట్లు వివరించారు. 'సంకల్పం – మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం' పేరుతో యువతలో అవగాహన కార్యక్రమాలు, సమావేశాలు, ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం రూపొందించిన పోలీస్ శాఖ ప్రచార పోస్టర్లను కలెక్టర్, ఎస్‌పి ఆవిష్కరించారు.

కేజీ గంజాయి స్వాధీనం - నలుగురు అరెస్టు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

గంజాయి కలిగి ఉన్న నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.అనిల్ కుమార్ తెలిపారు. లంకెలకూరపాడు గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద ఒక మహిళ ఇంటికి వెళ్లి రూ.లక్ష డిమాండ్ చేస్తూ ఆమెపై దాడికి దిగిన కేసులో చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన బోరిగర్ల నాగరాజు, మధిర లక్ష్మిరెడ్డి, కుమ్మేత మహేశ్వరరెడ్డి, లంకెలకూరపాడు గ్రామానికి చెందిన క్రిష్టిపాటి శివానాగిరెడ్డిని అరెస్టు చేస్తున్న సమయంలో వారి వద్ద సుమారు కేజీ గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై గతంలో కూడా పలు కేసులు ఉన్నాయని, అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.

సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

ప్రజాశక్తి – మంగళగిరి

మున్సిపల్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు పి.శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని, 12వ పిఆర్‌సిని నియమించి మున్సిపల్ కార్మికులందరికీ జీతాలు పెంచాలని కోరారు. ఈ సంవత్సరం జులైలో ఇంజినీరింగ్ కార్మికులు 10 రోజులు, పారిశుధ్య కార్మికులు ఏడు రోజులు సమ్మె చేశారని, సమ్మె కాలపు జీతాన్ని చెల్లిస్తానని సిఎం చంద్రబాబు అంగీకరించిన దృష్ట్యా ఆ మేరకు జీవో జారీ చేయాలని కోరారు. గ్రాట్యుటీ చెల్లించి వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలన్నారు. దీర్ఘకాలిక అనారోగ్యానికి గురైన, మరణించిన, రిటైర్ అయిన వారి స్థానంలో వారి పిల్లలకు అవకాశం కల్పించాలని కోరారు. ఆప్కాస్ ద్వారా రిటైర్మెంట్ అవుతున్నవారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, బదిలీ, కోవిడ్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. సిఐటియు అఖిల భారత మహాసభ సందర్భంగా జనవరి 4న విశాఖపట్నంలో జరిగే బహిరంగ సభకు మున్సిపల్ కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ చెంగయ్య, నాయకులు బి.వెంకటేశ్వర్లు, ఆర్.వేణు, పి.కృష్ణ, వి.వెంగమ్మ, వై.శివనాగేశ్వరరావు, కె.ఆంజనేయులు, టి.బాబు, స్వామి, పార్వతి, కె.రామయ్య, నాగేంద్రబాబు, శాంతమ్మ, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు 'కిల్కారి' కాల్ ద్వారా జాగ్రత్తలు

ప్రజాశక్తి – బెల్లంకొండ


మండలంలోని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళశారం ఆశాడే సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కిల్కారి ప్రోగ్రాం అధికారి రాజు పలు అంశాలను వివరించారు. కిల్కారి కాల్స్ అందరికీ రావాలంటే ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో గర్భిణుల వివరాలు సకాలంలో కచ్చితంగా నమోదు చేయాలని చెప్పారు. కిల్కారి కాల్ వచ్చినప్పుడు పూర్తిగా సమాచారాన్ని వినే గర్భిణులు, బాలింతల సంఖ్య పెరగాలని, దీనికోసం ఆశాలు, ఎఎన్ఎంలు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హైరిస్క్ సూచనలు, కుటుంబ నియంత్రణ పద్ధతులు, బర్త్‌ప్లాన్, రక్తహీనత, ప్రమాదకరమైన లక్షణాలు, టీకాలు తదితర ముఖ్య అంశాలను కిల్కారి కాల్స్‌లో వివరిస్తారని అన్నారు. ఈ కిల్కారి కాల్స్ గర్భిణీ నాలుగో నెల మొదలుకొని బిడ్డ సంవత్సరం వరకు నెలకు ఒక్కసారి



వాయిస్ కాల్స్ ద్వారా సమాచారం అందిస్తారని తెలిపారు. కిల్కారి కాల్ వచ్చే నంబర్ 911 600 40 3660ను గర్భిణులు, బాలింతలు ఫోన్‌లో సేవ్ చేసుకోవాలని, అప్పుడే కాల్ వచ్చినప్పుడు లిఫ్ట్ చేసి సమాచారాన్ని వినగలుగుతారని, ఇందుకు సూపర్‌వైజర్లు బాధ్యత తీసుకోవాలని సూచించారు. అదే సమాచారాన్ని మళ్లీ వినాలంటే 14423 లేదా 1800 532 1255 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి వినొచ్చని చెప్పారు. వీటిపై ఆశాలు, ఎఎన్ఎంలు ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. సమావేశంలో డాక్టర్ కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రై సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి – వినుకొండ



చంద్రబాబు ముఖ్యమంత్రిగా 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వికలాంగులకు 40 ట్రై సైకిళ్లను చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మంగళవారం పంపిణీ చేశారు. తన కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వికలాంగులు 3 శాతం ఉంటే వినుకొండలో 5 నుంచి 6 శాతం ఉన్నారని, అందుకు కారణాలు, పరిష్కారాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. ట్రై సైకిళ్ల పంపిణీకి ముందుకొచ్చిన శివశక్తి ఫౌండేషన్ చైర్‌పర్సన్, తన భార్య లీలావతినీ ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు అభినందించారు. ఫౌండేషన్ ద్వారా 28 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, నియోజకవర్గంలో మెడిసిన్, ఇంజినీరింగ్, ఏదేని డిగ్రీ, పీజీ చదివే వికలాంగులు, మైనార్టీలకు కూడా ప్రత్యేక స్కాలర్‌షిప్ అందిస్తామని అన్నారు. అర్హులు వారం రోజుల్లో శివశక్తి మేనేజర్‌ను కలిసి దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నాగశ్రీను రాయల్ పాల్గొన్నారు.

తల్లీకొడుకు హత్య కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి – సత్తెనపల్లి రూరల్ : మండలంలోని ధూళిపాళ్లలో తల్లీకొడుకును హత్య కేసులో ముగ్గుర్ని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నాదెండ్ల మండలం గణపవరానికి చెందిన చెరుకూరు రోహిత్ చౌదరి, చిలకలూరిపేటకు చెందిన సాతులూరి రవికుమార్, షేక్ జావేద్ అస్లామ్‌ను అరెస్టు చేశామని రూరల్ సిఐ హైమారావు తెలిపారు. వీరు మైనర్లు కావటంతో గుంటూరు జువైనల్ కోర్టులో హాజరు పరిచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.



నవోదయ పరీక్షలకు ఉచితంగా శిక్షణ

ప్రజాశక్తి – మాచర్ల రూరల్ : నవోదయ విద్యాసంస్థల్లో ప్రవేశం కోసం జరిగే పరీక్షలకు మాచర్లలోని శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి మంగళవారం తెలిపారు. స్థానిక నెహ్రూ నగర్‌లోని యూపీ స్కూల్లో సాయంత్రం 5:30 నుంచి 6:30 వరకు క్లాసులు జరుగుతుండగా ఐదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు ఈ క్లాసులకు హాజరవుతున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని మరింత మంది సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-ఈపూరు : చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై కె.వేణుగోపాల్ అన్నారు. ఈపూరు జెడ్‌పి పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ క్రిమినల్ చట్టాలపై వివరించారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలు, అమలవుతున్న చట్టాలను చెప్పారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

వృద్ధుల పట్ల ప్రేమతో ఉండాలి

ప్రజాశక్తి – పెదకూరపాడు : వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమతో వ్యవహరించాలని జన చైతన్య సమితి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని హుస్సేన్ నగరం గ్రామానికి చెందిన సత్తెనపల్లి ఎల్ఐసి ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షులు మంచాల రమేష్ పుట్టినరోజు సందర్భంగా సత్తెనపల్లిలోని ఆదరణ వృద్ధుల శరణాలయంలో మంగళవారం భోజనాన్ని ఏర్పాటు చేశారు. బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు, జనచైతన్య సమితి వ్యవస్థాపన అధ్యక్షులు దాసరి విజయ్ బెన్ని బాబు, ఆశ్రమం నిర్వాహకులు కొమ్మువరపు రిషిత పాల్గొన్నారు.

ఇసుక సరఫరాకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇసుక సరఫరా జరిగేలా మైనింగ్ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక సరఫరాపై ఐవిఆర్ఎస్ ద్వారా నిర్వహిస్తున్న పబ్లిక్ పర్సెప్షన్‌లో సంతృప్తి స్థాయి మరింత మెరుగుపరిచేలా మైనింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇబ్రహీంపట్నం నుంచి లింగాయపాలెం వరకు కృష్ణా నదిలో నావిగేషన్ ఛానల్ - 4లో ఇసుక తవ్వకాలకు ఎన్. ఓ. సి జారీ చేసినందున నిర్దేశిత మార్గదర్శక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల సామర్థ్యం మేరకు అను మతించిన టన్నుల వరకు మాత్రమే ఇసుకను సరఫరా చేసేలా వాహ నాల యజమానులకు అధికారులు అవగాహన కల్పించాలని సూచిం చారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, జిల్లా మైనింగ్ జియాలజికల్ అధికారి చంద్రశేఖర్, జిల్లా భూగర్భ జల వనరుల శాఖ ఉపసంచాలకులు వందనం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ నజీమా బేగం, జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్, తెనాలి ఆర్డీవో శ్రీహరి, తహశీల్దార్లు పాల్గొన్నారు.

30న పెదనందిపాడులో బాలోత్సవాలు

ప్రజాశక్తి - పెదనందిపాడు : డిసెంబర్ 30న పెదనందిపాడు లో పెదనందిపాడు బాలోత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె. ఎస్.లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం పెదనందిపాడు లోని తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో జరిగిన బాలోత్సవాల సన్నాహసమావేశంలో ఆయన ప్రసంగించారు. నేటి బాలలు ఆటలకు దూరమయ్యారని, ఎక్కడ బాలోత్సవాలు నిర్వహించినా వేల సంఖ్యలో పిల్లలు పాల్గొంటున్నారని అన్నారు. పెదనందిపాడు, కాకుమాను మండలాలలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలో చదువుతున్న నాలుగవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థులు ఈ బాలోత్సవాలలో జరిగే పోటీలలో పాల్గొనేందుకు అర్హులని, నాలుగవ తరగతి నుండి ఏడవ తరగతి జూనియర్స్ విభాగంలో, ఎనిమిది నుండి పదవ తరగతి సీనియర్స్ విభాగంలోనూ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీలు జరిగే డిసెంబరు 30 వ తేదీ ఉదయం 9 గం.లకు బాలోత్సవాలు జరిగే ప్రదేశంలోనే పేర్లు నమోదు చేసుకుంటామని తెలిపారు. డ్రాయింగ్, తెలుగు పద్యాలు, వక్తృత్వం, వ్యాస రచన, స్పెల్ బీయింగ్, జనరల్ క్విజ్, అందమైన చేతివ్రాత,బంద గానం,సోలో సాంగ్,శాస్త్రీయ నత్యం, జానపద నత్యం గ్రూపు మరియు సింగిల్, కోలాటం, మట్టితో బొమ్మలు తయారు చేయడం, ఫ్యాన్సీ డ్రస్, ఏకపాత్రాభినయం, వ్యర్థ పదార్థాలతో వస్తువులు తయారు చేయడంలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ బాలోత్సవాలు నిర్వహించేందుకు బాలోత్సవ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త దాసరి శేషగిరిరావు ఛైర్మెన్‌గా, రిటైర్డ్ టీచర్ మక్కెన జవహర్ రాణి కన్వీనర్‌గా, తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు కో కన్వీనర్ గా మరో పది మందితో కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. సమావేశంలో గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు, పి.ఎ.ఎస్.కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రం వీరరాఘవయ్య, నూర్ భాష సుభాని సాహెబ్, కాపు వెంకట సుబ్బారావు, జంపని రామారావు తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో అతిథులు

విద్యతోపాటు సామాజిక బాధ్యత అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

కళాశాల విద్య అభ్యసించే విద్యార్థినిలు విద్యతోపాటు దేశభక్తి, సామాజిక బాధ్యత అలవర్చుకొని దేశాన్ని అభివద్ధి పథంలో నడపడంలో కీలక పాత్ర పోషించాలని విశ్రాంత వైమానిక దళ అధికారి చలసాని బలరాం ప్రసాద్ అన్నారు. స్థానిక సాంబశివపేట ప్రభుత్వ మహిళా కళాశాల నూతన విద్యార్థులకు స్వాగతం పలికే 'దీక్షారంభ్-2025-26' కళాశాల సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. కళాశాలను నూతన విద్యార్థినిలకు స్వాగతం పలుకుతూ రంగవల్లులతో తీర్చిదిద్దారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బలరాంప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్రం అనంతరం భారతదేశ చరిత్రలో మరుగున పడిన వాస్తవాలను తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థినిపై ఉందన్నారు. పరమత సహనం భారతీయ రక్తంలోనే ఉన్నదని దానికి సెక్యూలర్ వాదం క్రొత్తగా చేర్పించి ప్రజాస్వామ్యాన్ని వక్రమార్గం పట్టించారని చెప్పారు. దేశం అభివద్ధి పదంలో నడవాలంటే వాస్తవిక చరిత్రను విద్యార్థినులు అధ్యయనం చేయాలని కోరారు. చదువుతోపాటు క్రీడలు, సామాజిక అంశాలు, పోటీతత్వం, అలవర్చుకోవాలని తెలియజేశారు. విశ్రాంత రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి పార్వతీశాస్త్రి మాట్లాడుతూ దేశవిదేశాలలో అధికారిగా రాణించటంలో కళాశాల పూర్వ విద్యార్థినిగా ఆనందంగా ఉన్నదని కళాశాలకు లక్ష రూపాయలు విరాళం ప్రకటించారు. ఎస్‌బిఐ హైదరాబాద్, వనస్థలిపురం మేనేజర్ చదలవాడ వెంకటరమణి మాట్లాడుతూ 8 దశాబ్దాలుగా ప్రభుత్వ మహిళా కాలేజి తమలాంటి వేలాది మందిని తీర్చిదిద్దిందని అన్నారు.సభకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.రమాజోస్నకుమారి అధ్యక్షత వహించారు. క్రీడలు సాంస్కృతిక పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలకు ప్రశంసా పత్రాలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కల్నల్ రాంబాబు స్టూడెంట్ యూనియన్ కన్వీనర్ డాక్టర్ డి విజయశ్రీ, వి.లలితబాబు, డాక్టర్ పరుచూరి విజయలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ కష్ణవేణి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు

మందుబాబులకు జరిమానా విధించిన కోర్టు

ప్రజాశక్తి - తెనాలి : బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తూ ఐదుగురు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. రూరల్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం సోమవారం డ్రోన్ తో నిఘా చేపట్టిన రూరల్ పోలీసులకు కఠెవరం గ్రామం డంపింగ్ యార్డ్ సమీపంలో బహిరంగంగా మద్యం సేవిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకొని వారిని అదుపులోకి తీసుకుని, మంగళ వారం కోర్టుకు హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ 500 చొప్పున కోర్టు జరిమానా విధించినట్లు ఎస్సై ఆనంద్ వెల్లడించారు. అసాంఘిక కార్యకలా పాలను గుర్తించేందుకు నిరంతరం డ్రోన్ నిఘా ఉంటుందని ఎస్ఐ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-ఈపూరు : ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ఇనుమెళ్ల గ్రామ సమీపంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన పిల్లి కోటిరెడ్డి(30) తన ద్విచక్ర వాహనంపై వెళుతుండగా దారి మధ్యలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడి తలకు దెబ్బతగిలి మృతి చెందాడు. ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా రోడ్ల విస్తరణ

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు తగిన విధంగా రోడ్ల విస్తరణ, ప్రత్యామ్నాయ రహదారుల అభివృద్ధిపై అధికారులు దృష్టి పెట్టాలని నగర మేయర్ కోవెల మూడి రవీంద్ర అన్నారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధ్యక్షతన మంగళవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో గుంటూరు నగర ట్రాఫిక్ అడ్వైజరీ కమిటి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని కాకానిరోడ్ నుండి జాతీయ రహదారికి వెళ్లేలా రిలయన్స్ బంక్ దగ్గర నుండి రోడ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రధాన కేంద్రాల్లో అత్యాధునిక సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రధాన కేంద్రాల్లోని యాడ్ ఏజన్సీ సంస్థలు నిర్దేశిత టెండర్ నిబంధనల మేరకు ట్రాఫిక్ సిగ్నల్స్, బ్లింకర్స్, పోలీస్ అవుట్‌పోస్ట్, సిసి కెమెరాలు, వేఫైండర్స్, కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఆయా సంస్థలు ట్రాఫిక్ పోలీస్‌లతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సిసి కెమెరాల ఫీడ్‌ని తప్పనిసరిగా కమాండ్ కంట్రోల్ రూమ్‌కి అందించాలన్నారు. అలాగే ట్రాఫిక్ పోలీసులు, జిఎంసి పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు జాయింట్ ఇన్స్పెక్షన్లు చేసి, ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై నివేదిక ఇవ్వాలన్నారు.సమావేశంలో ట్రాఫిక్ డిఎస్పీ బి.శ్రీనివాసరావు, సిఐ అశోక్ కుమార్, జిఎంసి సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ (ఇంచార్జి) సుందర్రామిరెడ్డి, వివిధ మీడియా బోర్డ్ ల సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేయర్, కమిషనర్

IN THE COURT OF THE HON'BLE ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE CUM MOBILE COURT, AT: GUNTUR
O.S. NO. 509 OF 2024

Between:
Union Bank of India, Brodipet Branch,
Rep. by it's Branch Manager .....Plaintiff

AND

1). Sri Sai Lakshmi Mahila Podupu Sangham, Rep. by it's President Bellapu Ramya Latha, W/o. Pothu Raju & Secretary, Vericherla Annamma, W/o. Ravi Kumar, R/o. Door No. 3-178-104, Anjaneya Colony, Kothapet, Guntur-522001.
2) Bellapu Ramya Latha, W/o. Pothuraju, Aged about 28 Years, R/o. Door No.3-16-64, 2/21 Lane, Brodipet, Guntur-522002.
3). Vericherla Annamma, W/o. Ravi Kumar, Aged about 38 Years, R/o. Door No.5-64-52, 2/20 Lane, Brodipet, Guntur, Guntur District-522002.
4). Gaddam Mery Latha, W/o. Rajesh, Aged about 38 Years, R/o. Door No. 1-20-11, 2/20 Lane, Brodipet, Guntur, Guntur District-522002.
5). Bandlamudi Mary, W/o. Subba Rao, Aged about 38 Years, R/o. Door No.4-6-226/A/1, 1st Lane, Mutyalareddy Nagar, NTR Colony, Amaravathi Road, Guntur-522007.
6). Patchala Elishamma, W/o. Amruthulu, Aged about 43 Years, R/o. Door No.2-61-65, 2/20 Lane, Brodipet, Guntur, Guntur District-522002.
7). Pilli Roja Mary, W/o. Loodar Paul, Aged about 38 Years, R/o. Door No.25-14-154, Srinivasa Rao Thota, Guntur, Guntur District-522004.
8). Parre Suvarthamma, W/o. Babu Rao, Aged about 43 Years, R/o. Door No.2-42-44, 2/21 Lane, Brodipet, Guntur, Guntur District-522002.
9). Pilli Swathi D/o. Loodhar Paul, Aged about 28 Years, R/o. Door No.4-6-226/A/1, 1st Lane, Mutyalareddy Nagar, NTR Colony, amaravathi Road, Guntur -522007.
10). Karri Devika, W/o. Kotaiah, Aged about 38 Years, R/o. Door No.2-43-34, 2/21 Lane, Brodipet, Guntur, Guntur District - 522002.
11). Vagolu Raja Lakshmi, W/o. Babu Rao, Aged about 38 Years, R/o. Door No.3-96-22, 2/21 Lane, Brodipet, Guntur, Guntur District-522002. ..... Defendants

పై నెంబరు దావాను వాది, బ్యాంకునకు రావలసిన బాకీ వసూలు నిమిత్తం దాఖలు చేయగా సదరు దావాలో ప్రతివాదులు అయిన మీకు పైన తెలిపిన కోర్టు వారి నుండి దావా సమనులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమనులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని కోర్టు వారు **ది.04.12.2025** తేదీనకు వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజున ఉదయం **10.30 ని.లకు** పైన తెలిపిన కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గాని లేక మీ తరపున లాయరు గారి ద్వారా గానీ హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకొనగలరు. లేనిచో పైనతెలిపిన కోర్టు వారిచే చట్టప్రకారం మీ పరోక్షముగా విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది.04.12.2025
యూనియన్ బ్యాంక్ అఫ్ ఇండియా, బ్రాడిపేట బ్రాంచి, గుంటూరు
వారి తరపున ఈమని నాగేంద్ర ప్రసాద్, అడ్వకేట్,
ఏ.టి. అగ్రహారం, గుంటూరు.
ఫోన్: 9490542445, 7981901988.

పాస్‌పోర్ట్ పోయినది

రామకృష్ణ కాకుమాను తండ్రి రమేష్ .4-42, లక్ష్మీపురం, పెదనందిపాడు గ్రామం, మండలం, గుంటూరు జిల్లా. వీరికి చెందిన పాస్ పోర్ట్ , పాన్ కార్డు, మోటార్ సైకిల్ ఆర్.సి మరియు ఇతర డాక్యుమెంట్స్ నవంబర్ 6, 2025 నాడు పెదనందిపాడు లో జిరాక్సులు తీయించు నిమిత్తం ఇంటి వద్ద నుండి సంచిలో పెట్టి తీసుకువచ్చుచుండగా మార్గమధ్యంలో బండి మీద నుండి జారి పోయినవి. ఎంత వెతికినా కనపడలేదు. ఎవరికైనా దొరికిన యెడల 6303075747 ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు

ప్రకటన

నా క్లయింట్ అయిన రావూరి నాగమణి భర్త: (లేటు) రావూరి హరిబాబు, R/O. గార్లపాడు గ్రామం, కాకుమాను మండలం, గుంటూరు జిల్లా. తేది:28.11.2025న ఆమె తనకు సంబధించి దస్తావేజులు అనగా దఖలు దస్తావేజు నెం.375/1984 (ఒరిజినల్), SRO Kakumanu దస్తావేజును కవరులో పెట్టుకొని జిరాక్స్ నిమిత్తం బైక్ మీద వెళ్తున్నప్పుడు కాకుమాను సమీపంలో జారిపడి పోయినది. వెంటనే అక్కడ ఆ దగ్గరలో మరియు చుట్టుపక్కల అంత వెతికినను కనిపించలేదు చుట్టుప్రక్కల వారిని విచారించినను ఫలితము లేదు. కావున ఎవరికైన దొరికిన యెడల దయచేసి ఈ దస్తావేజును ఈ చిరునామాకి అప్పగించగలరు.
ఫోన్ : 8341356178.

కాసు వెంకట రెడ్డి (అడ్వకేట్)
డోర్ నెం:6-14-13,
14/3 అరండల్ పేట్, గుంటూరు

నోటీసు
మహారాజశ్రీ గుంటూరు స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అఫ్ ఫస్ట్ క్లాస్ ఫర్ ఎక్సైజ్ వారి కోర్టులో
ఐ.ఎ.నెం.3/2025 ఇన్ ఓ.యస్.నెం.691/2023

బిట్వీన్.
వట్టికొండ కోటేశ్వరరావు ....పిటీషనరు/వాది
మరియు
గంగవరపు పార్వతి వగైరా
....రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

టు,
R-2: గంగవరపు ఆదిత్య కుమార్,
తండ్రి నాగేశ్వరరావు, నివాసం పోస్టల్ కాలనీ,
గుంటూరు (సిటీ & జిల్లా)

పై నెంబరు దావాలోని ఐ.ఎ.నెం.3/2025 పిటీషనులో 2వ రెస్పాండెంటు అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని సార్లు నోటీసులు పంపించినను ముట్టనందున మీకు నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది. 19-12-2025కి వాయిదా వేసినారు.కావున వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసి నదిగా తెలియజేయడమైనది.లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా తేది:19-12-2025

వి.బి.సుమంత్,
పిటీషనరు/ వాది తరపు అడ్వకేట్,
నారాకోడూరు, చేబ్రోలు మండలం,
గుంటూరు జిల్లా.

గత ప్రభుత్వ వైఫల్యాలను అధిగమిస్తున్నాం

నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యే నసీర్ - 53వ డివిజన్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు
జిల్లా ప్రతినిధి



ప్రధానంగా దళిత వాడలో మెరుగైన మౌలిక వసతులు కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. మంగళవారం స్థానిక 53వ డివిజన్లోని సంజీవయ్య నగర్, వెంగళ రావు నగర్, వసంతరాయపురం ప్రాంతాల్లో రూ.2.15 కోట్లతో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, పైపు పైన్ల నిర్మాణానికి నగర మేయర్ కోవెలమూడి రవీంద్రతో కలిసి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే రూ.26 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని అన్నారు. దళితవాడలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకుమ అధిక శాతం నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. గత జగన్ ప్రభుత్వంలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాల వైపు కన్నెత్తి కూడా చూడలేదని విమర్శించారు. కొన్ని ప్రాంతాలకు నడకదారి కూడా నరకంగా మారిందని చెప్పారు. సిఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని డివిజన్లలో అభివద్ధికి పునాదులు వేశామని తెలిపారు. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయని, మురుగునీరు రోడ్లపై నిలుస్తుందని చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందుకు వెళుతున్నామని ఈ సందర్భంగా వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షైక్ షాజీలా, గొల్ల ప్రభాకర్, మహంకాళి నరసింహారావు, కిషర్, నవీన్, డివిజన్ అధ్యక్షులు గుడిమెట్ల దయారత్నం, కొండూరు శ్యామ్, కాకర్ల శ్యామ్, బాబురావు, బాబు పాల్గొన్నారు.

హత్యలు చేసిన వారికి కిరీటాలు పెట్టాలా?

- సమాధులకు చందాలు వసూలు చేసిన చరిత్ర మీది
- మహేష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డిపై ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ధ్వజం



ప్రజాశక్తి - వెల్దుర్తి

జూలకంటి కుటుంబ చరిత్ర తెలుసుకుని మాజీ ఎమ్మెల్యేలు కాసు మహేష్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెల్దుర్తిలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలపై విమర్శలు గుప్పించారు. కుటుంబంలో ఒకరు చనిపోతే సమాధికట్టడానికి చందాలు వసూళ్ళ చేసిన చరిత్ర కాసు కుటుంబానిదని అన్నారు. తనతండ్రి రెండుసార్లు, తల్లి ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచారని, తమ కుటుంబం ఎప్పుడూ హత్యా రాజకీయా లను ప్రోత్సహించలేదని అన్నారు. హత్యలు, అరాచకాలు, దోపిడీలు చేసిన పిన్నెల్లి సోదరులకు మహేష్‌రెడ్డి, శ్రీనివాస రెడ్డి మద్దతుగా మాట్లాడటం సరైంది కాదన్నారు. మాచర్లలో ఎవరి హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో మాట్లాడు కుందాం రావాలని సవాలు విసిరారు. జంట హత్యలు చేసిన పిన్నెల్లి సోదరులపై కేసుల కాకుండా.. కిరీటాలు పెట్టాలా? అని ప్రశ్నించారు. 2019 గుంటూరులో తమ ఇంటికి వచ్చిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అండ్ కో 4 గంటలు కూర్చొని ఏం రాజకీయం చేయాలని చూశాడో తెలుసుకొని మాట్లాడాలన్నారు. మీ రాజకీయాలు కారణంగా నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఆధ్యులైన ముత్యాలరాజు ఏమయ్యారో పల్నాడు ప్రజలకు తెలుసన్నారు. విగ్రహాల దొంగతనంలో నీ వాటా ఎంత గోపిరెడ్డి అని ప్రశ్నించారు. విగ్రహాల దొంగతనం కేసులో పిన్నెల్లి ముద్దాయిగా ఉన్నారో లేదో ప్రకాశం జిల్లా, చందోలు బౌద్ధ మ్యూజియంలోని రికార్డులను అడగాలన్నారు. ఆ రికార్డులు తెరిస్తే.. నేదురుమల్లి జనార్దన్ రెడ్డి కాళ్లపై పడిన పిన్నెల్లి కుటుంబం చరిత్ర బయటకొస్తుందని అన్నారు.

నేడు గోలి గ్రామానికి ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని గోలి గ్రామంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి బుధవారం పర్యటిస్తారని టిడిపి నాయకులు కోరే నాగేశ్వరరావు, కోటేశ్వరరావు తెలిపారు. రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని, అనంతరం పార్టీ నేతలతో సమావేశమవుతారని పేర్కొన్నారు.

వేధించిన వారి పేర్లు డిజిటల్ బుక్‌లో నమోదు

అధికారంలోకి రాగానే వారిపై చర్యలు : వైసిపి



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కాసు కుటుంబంపై మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చేసిన వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తు న్నట్లు వైసిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చెప్పారు. నరసరా వుపేటలోని కాసు మహేష్‌రెడ్డి నివాసంలో మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ వెల్దుర్తి మండలం గుండ్లపల్లి జంట హత్యలు జరిగిన మొదటి గంటలో అప్పటి ఎస్‌పి కె.శ్రీనివాసరావు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారని, ఆధిపత్య పోరే హత్యలకు కారణమని చెప్పారని అన్నారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి వైసిపి నేతలు, కార్యకర్తలపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేసి వేధింపులకు పాల్పడుతోందని విమర్శించారు. వైసిపి నేతలను వేధించిన వారి వివరాలు డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తున్నామని, వైసిపి అధికారంలోకి రాగానే చర్యలు తీసుకుంటామని చెప్పారు. రెడ్డి ఎయిడెడ్ కళాశాల స్థలాన్ని 60 ఏళ్ల క్రితం కాసు కుటుంబీకులు కొనుగోలు చేశారని, కళాశాల కమిటీ సభ్యుల అనుమతితో కన్వెన్షన్ హాల్ నిర్మించినట్లు చెపా్పు. కాసు కన్వెన్షన్ సెంటర్‌పై బహిరంగ చర్చకు సిద్ధమన్నారు.

579.70 అడుగుల వద్ద సాగర్ నీటిమట్టం

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు మంగళవారం శ్రీశైలం ప్రాజెక్టు నుండి నీటి విడుదల తగ్గటంతో సాగర్ ప్రాజెక్టు నుండి దిగువ ఉన్న ప్రాజెక్టులకు 44006 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి కాల్వకు 8023 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 5226 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి 29557 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసికి 1200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ నీటిమట్టం 579.70 అడుగుల వద్ద ఉంది. ఇది 282.14 టీఎంసీలకు సమానం. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590.00 అడుగులు కాగా ఇది 312.0450 టీఎంసీలకు సమానం.

ధాన్యం కొనుగోలు నిబంధనలపై అవగాహన కల్పించండి : కలెక్టర్



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ధాన్యం కొనుగోలు నిబంధనలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఆదేశించారు. ధాన్యం కొనుగోలుపై అధికారులతో నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. తేమ శాతం 17 లోపు ఉండాలని, ఎక్కువగా ఉంటే రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు అవకాశం ఉన్నచోట ఉచితంగా టార్పాలిన్ పట్టాలు అందించాలని చెప్పారు. నకరికల్లు, కారంపూడి, రాజుపాలెం మండలాల్లో ధాన్యం ఆరబెట్టుకునేందుకు 200 టార్పాలిన్ పట్టలు పంపిణీ చేశారని, కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు రవాణా వాహనాలు, సరిపడా కూలీలు, గోనె సంచులు, అందుబాటులో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. కొనుగోలు కేంద్రాలను తహశీల్దార్లు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. సమీక్షల్లో పౌర సరఫరాల డీఎం నారదముని, జిల్లా మార్కెటింగ్ అధికారి ఉపేంద్ర కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు పాల్గొన్నారు.

నేడు జిల్లా వ్యాప్తంగా రైతన్నా మీకోసం గ్రామ సభలు

జిల్లా వ్యాప్తంగా 347 రైతుసేవా కేంద్రాల వద్ద 'రైతన్నా మీకోసం' గ్రామ సభలను బుధవారం నిర్వహించాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల ఆదేశించారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. గ్రామ సభలలో 2025-26 రబీ, 2026 ఖరీఫ్, 2026-27 రబీ సీజన్‌ల పంట ప్రణాళికలపై రైతులతో చర్చించాలన్నారు. రానున్న ఐదేళ్లలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన పంచ సూత్రాల (నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు) ఆధారంగా పంట ప్రణాళిక తయారీలో అధికారులు, రైతులు భాగస్వాములు కావాలని చెప్పారు.

వర్సిటీ నెట్‌బాల్ జట్టుకు వాగ్దేవి విద్యార్థినులు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళల నెట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు గత నెల 28, 29వ తేదీల్లో యూనివర్సిటీలో నిర్వహించగా నరసరావు పేటలోని వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.రాజేంద్రప్రసాద్ తెలిపారు. తమ విద్యార్థినులు షేక్.దిల్ అఫ్రోజ్, కుంచాల నందిని యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యారని చెప్పారు. వీరు వచ్చేనెల 9న మచిలీపట్నంలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నెట్‌బాల్ టోర్నమెంటులో పాల్గొననున్నారని చెప్పారు. ఎంపికైన వారిని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, చైర్మన్ కట్ల రామకోటేశ్వరరావు, డైరెక్టర్స్ ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, సూదా సురేష్‌బాబు, పాశం కృష్ణారావు అభినందించారు.

కంది పైరుపై గడ్డి మందు ప్రయోగం

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరుకు చెందిన నాసిన రామాంజనేయులు 1.63 ఎకరాల్లో కంది పంటను సాగు చేశాడు. పాత కక్షల నేపథ్యంలో గ్రామానికి చెందిన నాసిన ఏడుకొండలు, అతని కుమారులు నాసిన గోవిందు, నాసిన రమేష్ కంది పంటపై గడ్డి మందు పిచికారి చేయడంతో పంట పూర్తిగా దెబ్బతింది. నాసిన రామాంజనేయులు భార్య పేరమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై కె.వేణుగోపాల్ కేసు నమోదు చేశారు.

పెంచలయ్య హత్యపై ప్రజానాట్యమండలి నిరసన



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గంజాయి, డ్రగ్స్ సేవించడం వల్ల కలిగే అనర్థాలను గేయాల రూపంలో వివరిస్తూ నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఆర్డీటీ కాలనీలో ప్రజలను, యువతను చైతన్య పరుస్తున్న ప్రజానాట్య మండలి కళాకారుడు కె.పెంచలయ్యను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజానాట్య మండలి పల్నాడు జిల్లా కార్యదర్శి టి.పెద్దిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు నరసరావుపేట ధర్నా చౌక్ వద్ద మంగళవారం చేపట్టిన నిరసనలో పెద్దిరాజు మాట్లాడుతూ పెంచలయ్యను గంజాయి విక్రయిస్తున్న మహిళ తన అనుచరులతో హత్య చేయించిందని మండిపడ్డారు. నిరసనకు సంఘీభావంగా సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ గంజాయి విక్రయాలను అడ్డుకుంటే చంపుతారా అని ప్రశ్నించారు. 2026 మార్చి నాటికి నక్సల్స్ రహిత భారతదేశం ప్రకటిస్తామని చెబుతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం... నక్సల్స్‌ను చంపి అటవీ ప్రాంత ఖనిజ సంపదను దోచుకోవడానికి యత్నిస్తోందని విమర్శించారు. నిరసనలో కొండా నాయక్, కె.నాగేశ్వరరావు, పీటర్ పాల్గొన్నారు.

టిడ్కో గృహ లబ్ధిదార్లకు ప్రైవేటు సంస్థలతో రుణాలు

ఏప్రిల్ నాటికి 5,520 గృహ ప్రవేశాలు చేయిస్తాం : ఎమ్మెల్యే పుల్లారావు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలో టిడ్కో గృహాల నిర్మాణం, లబ్ధిదార్లకు కేటాయింపుపై సంబంధిత అధికారులు, బ్యాంకర్లతో స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం సమీక్షించారు. మొదటి దశలో 520 మందికి ఇళ్లు మంజూరవగా లబ్ధిదార్లకు జాతీయ బ్యాంకులు ఇప్పటికీ రుణాలివ్వలేదని, తాజాగా రుణాల మంజూరుకు ఈజీ హౌసింగ్ ఫైనాన్స్, ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ సంస్థలు రుణాలివ్వడానికి ముందుకొచ్చాయని చెప్పారు. మొదటి దశ లబ్ధిదార్లంతా ఒకేసారి పూర్తిసొమ్ము కట్టినా, లేదా బ్యాంకులు, ప్రైవేట్ సంస్థల రుణం తీసుకున్నా ఇళ్ల రిజిస్ట్రేషన్ చేస్తామని ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు 10 రోజుల్లో రుణాలిచ్చేలా చూస్తామన్నారు. గతంలో దెబ్బతిన్న ఇళ్లకు మరమ్మతులు, మౌలిక వసతుల కల్పనతోపాటు, ప్రార్థనా మందిరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సచివాలయ భవనాలు, చేతివృత్తుల వారికి ప్రత్యేక గదులు, శ్మశానాలతోపాటు పోలీస్ ఔట్‌పోస్టు కూడా టిడ్కో గృహ సముదాయం వద్ద ఏర్పాటు చేశామని తెలిపారు. పట్టణంలో నిర్మించిన 5,520 ఇళ్లల్లో ఏప్రిల్ నాటికి గృహప్రవేశాలు జరిగేలా ప్రణాళిక రూపొందించామన్నారు. సమీక్షలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టి.రాజారమేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, టిడిపి పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్‌ఖాన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు



పొలాలను పరిశీలిస్తున్న నాబార్డు బృందం

గోలి వాగు నీటి వృథాపై నాబార్డు, నేస్తం ఫౌండేషన్ బృందం ఆశ్చర్యం

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని గోలి గ్రామంలో నాబార్డు (నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్మెంట్) నేస్తం ఫౌండేషన్‌కు చెందిన అధికారుల బృందం మంగళవారం పర్యటించింది. రబీ పైర్లను పరిశీలించి అవి ఎదగడానికి నీళ్లు ఎక్కడ నుంచి వస్తాయని ప్రశ్నించారు. సాగునీటి కాల్వల సౌకర్యం, బోర్ వేస్తే ఎన్ని వందల అడుగుల్లో నీరు లభ్యమవుతుంది? అనే వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోలి వాగును పరిశీలించి వృథాగా పోతున్న వందల క్యూసెక్కుల నీటిని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ నీటిని నిల్వ చేసే మార్గం కూడా ఆలోచించాలని వారిని రైతులు కోరారు. పరిశీలనలో నాబార్డు డీడీఎం శరత్‌బాబు, నేస్తం ఫౌండేషన్ సీఈవో వి.సురేష్, గోపి, హార్టికల్చర్ అసిస్టెంట్ వెంకటేష్ పాల్గొన్నారు.

17న పెన్నవర్ల దినోత్సవం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా 17న నరసరావుపేటలోని సంఘ భవనంలో ప్రత్యేక సమావేశం ఉంటుందని సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు మానం సుబ్బారావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా 75 ఏళ్లు నిండిన పెన్షనర్లను సత్కరిస్తామని, ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు, కార్యదర్శులు జి.ప్రభుదాస్, సుబ్బారాయుడు, జి.రామకృష్ణారావు హాజరై పెన్షనర్ల సమస్యలపై మాట్లాడతారని పేర్కొన్నారు.

వ్యవసాయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే

రైతు సంఘం మండల మహాసభలో జొన్నా శివశంకరరావు, కె.అజయ్‌కుమార్



ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల మూడవ మహాసభ కు ఎన్నికైన నూతన కమిటీతో నాయకులు

ప్రజాశక్తి–తాడేపల్లి రూరల్

వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉన్న ఈ తరుణంలో భూములను, రైతులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదే అని, ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ అన్నారు. మంగళవారం ఎం.టి.ఎం.సి పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల మూడవ మహాసభ రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు మోదుగుల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగింది. ముందుగా రైతు సంఘం జెండాను రైతు సంఘం సీనియర్ నాయకులు అమ్మిశెట్టి రంగారావు ఆవిష్కరించారు. ఈ మహాసభను ఉద్దేశించి రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ తాడేపల్లి మండల ప్రాంతంలో రైతు సంఘం రైతులు, కౌలు రైతులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పైన పోరాటం చేసిందన్నారు. రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే రాజధాని పేరుతో ఈ ప్రాంతంలో 50,000 ఎకరాలను తీసుకున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారులకి వచ్చిన తర్వాత మరోసారి రైతుల వద్ద నుండి రాజధాని అభివృద్ధి పేరుతో భూములు తీసుకునేందుకు పూనుకుంటున్నారని అన్నారు. భవిష్యత్తులో వ్యవసాయ భూములు తగ్గి, ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. తాడేపల్లి మండల ప్రాంతంలో విలువైన, సారవంతమైన భూములు సంవత్సరానికి మూడు పంటలు పండే భూములని అన్నారు. ఒకవైపున ప్రకృతి విపత్తులు, వరదలు, అకాల వర్షాలతో రైతులు పంటలు నష్టపోయి, తీవ్ర నష్టాలలో కూరుకుపోయారని అన్నారు. అరటి, పసుపు, కంద, వరి, వంటి పంటలు నీట మునిగి, పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయి ఇబ్బందులు పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. పంటల బీమా పథకాన్ని రైతులందరికీ వర్తింప చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందన్నారు. ప్రధాన పంటగా ఉన్న వరి సాగు చేసే రైతులు తీవ్ర నష్టాలలో ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.1792 మద్దతు ధర ప్రకటించినప్పటికీ, తుపాను ప్రభావంతో, తేమ శాతం 17 ఉండాలని ప్రభుత్వ నిబంధనలతో ధాన్యం రైతులు బస్తా రూ.1300లకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రైతుల పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లభిస్తేనే ఆత్మహత్యలు ఆగుతాయని, ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసి, ఇతర దేశాలకు ఎగుమతి చేసే పరిస్థితి వస్తుందన్నారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జనవరి 29, 30, 31, ఫిబ్రవరి 1, తేదీలలో గుంటూరు నగరంలో ఆల్ ఇండియా కిసాన్ సభ పెద్ద ఎత్తున సెమినార్, రైతులు పండించిన పంటల ఉత్పత్తుల స్టాల్స్ నిర్వహిస్తుందని అన్నారు. దేశవ్యాప్తంగా రైతు సంఘం ప్రతినిధులు, రైతులు హాజరవుతున్నరని రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. అనంతరం మండల నూతన కమిటీ, అధ్యక్ష, కార్యదర్శులుగా మోదుగుల శ్రీనివాసరెడ్డి, కాజా వెంకటేశ్వ రరావు, ఉపాధ్యక్షులుగా అమ్మిశెట్టి రంగారావు, సహాయ కార్యదర్శిగా బొప్పన గోపాలరావును ఏకగ్రీవంగాఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు డి వెంకటరెడ్డి, కె ఈశ్వరరెడ్డి, పల్లె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న అమ్మిశెట్టి రంగారావు



పేదలకు రెండు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలి

వ్యకాస మహాసభలో ఈమని అప్పారావు

ప్రజాశక్తి – మంగళగిరి రూరల్

ఇల్లు లేని పేదలకు రెండు సెంట్లు ఇళ్ల స్థలాన్ని మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కాజలో వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ పాలేటి అప్పారావు అధ్యక్షతన జరిగింది. మహాసభలో ఈమని అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇళ్ల స్థలాలు లేని పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని, అలాగే ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినప్పటికీ ఇంతవరకు ఆ ఊసే ఎత్తటం లేదని విమర్శించారు. అలాగే పేదలకు ఉపయోగకరంగా ఉన్న 9/77 అసైన్మెంట్ చట్టం సవరణ చేస్తూ నిర్ణయం తీసుకుందని, పేదలకు కవచంగా ఉన్న ఈ చట్టం మార్పు చేయటం పేదల అన్యాయం చేయడమేనని తెలిపారు. అలాగే అనేక సంవత్సరాలుగా చెరువు పోరంబోకు భూముల్లో, ఫారెస్ట్ భూముల్లో, ప్రభుత్వ భూములలో నివాసముంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, అలాగే లంక భూములు సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు మంగళగిరి రూరల్ మండల కార్యదర్శి వుద్దంటి దుర్గారావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో ఇల్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు వెంటనే మంజూరు చేయాలని అలాగే కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ లో విలీనమైన గ్రామాల్లో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉందని దీనితోటి దోమల విపరీతంగా పెరిగి డెంగ్యూ లాంటి విష జ్వరాలు సోకుతున్నాయని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మంగళగిరి మండల కార్యదర్శి బి. కోటేశ్వరి మాట్లాడుతూ కాజలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొద్దిపాటి వర్షానికి ఇల్లు మునిగిపోతున్నాయని, డ్రైనేజీ బాగు చేస్తామని అధికారులు మాటలు చెబుతున్నారు తప్ప ఆచరణలో అమలు చేయడం లేదని తెలిపారు . అనంతరం 10 మందితో కాజ ఏరియా కమిటీ, అధ్యక్ష కార్యదర్శులుగా వల్లభాపురం త్రివేణి, పాలేటి అప్పారావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కె ఝాన్సీ, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈమని అప్పారావు

పెంచలయ్యను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి – మంగళగిరి రూరల్

గంజాయి మాఫియా హత్యాకాండలో మరణించిన పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని, గంజాయి మాఫీయాను అరికట్టాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో కాజలోని పాల కేంద్రం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మంగళగిరి మండల కార్యదర్శి వుద్దంటి దుర్గారావు మాట్లాడుతూ నెల్లూరు పట్టణంలో గంజాయికి వ్యతిరేకంగాను, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులను ,యువకులను, ప్రజలను చైతన్యవంతం చేస్తున్న ప్రజానాట్యమండలి నాయకులు యువజన నాయకులు పెంచలయ్యను గంజాయి మాఫియా అత్యంత దుర్మార్గంగా హత్య చేసిందని, వీరికి కఠిన శిక్షణ విధించాలని వారు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో గంజాయి మాఫీయాను అరికట్టాతామని చెప్పినప్పటికీ మాటల తప్ప ఆచరణలో ఒక అడుగు కూడా ముందుకు వేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గంజాయి మాఫియా దుర్మార్గానికి బలైపోయిన పెంచలయ్య కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ మంగళగిరి మండల నాయకులు బి కోటేశ్వరి నాయకులు కే .గోపాల్ రెడ్డి, శివారెడ్డి , ఝాన్సీ, పాలేటి అప్పారావు, అరుణ, వల్లభాపురం త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

పెంచలయ్య హత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ నిడమర్రులో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాజధాని డివిజన్ నాయకులు ఎం భాగ్యరాజు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ రెండో శాఖ కార్యదర్శి గైరు బోయిన నాగేశ్వరరావు, ప్రకాశరావు, అంకమ్మరావు, రాజమునీ, కే నాగేశ్వరరావు, ఎమ్మెల మరియదాసు, ఆశీర్వాదం పాల్గొన్నారు.

ప్రజాశక్తి– తాడేపల్లి : నెల్లూరు సిపిఎం నాయకులు, ప్రజానాట్యమండలి కళాకారులు పెంచలయ్యను హత్య చేసిన గంజాయి మాఫియా ముఠాకి చెందిన నిందితులను కఠినంగా శిక్షించాలని సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం రవి డిమాండ్ చేశారు. రాజధాని ముఖద్వారం అయినా ఉండవల్లి సుందరయ్య చౌక్‌లో పెంచలయ్య హత్యను ఖండిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లభాపురం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రవి మాట్లాడుతూ పెంచలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. మాదకద్రవ్యాలకు వ్యతిరే కంగా కలిసి వచ్చే వారందరినీ కలుపుకొని సిపిఎం ప్రజా ఉద్యమాన్ని చేపడుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో పిఎన్ఎం గుంటూరు జిల్లా నాయకులు ఆర్ వి రాఘవయ్య, సిపిఎం నాయకులు కే జగదీశ్వర్ రెడ్డి సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు ఈమని రామారావు, ఎస్ ఇమ్మాని యేల్ రాజు, ఎస్కే ఎర్ర పీరు, కే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి – దుగ్గిరాల :** చిలువూరు అంబేద్కర్ విగ్రహం వద్ద పెంచలయ్య హత్య ను తీవ్రంగా ఖండిస్తూ కొవ్వొత్తులతో వ్యకాస ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, నాయకులు కె జోజి, ఎం కోటేశ్వరావు కే శ్రీనివాసరావు కె ప్రకాష్ టి శ్రీనివాసరావు చిరంజీవి ఎం కోటేశ్వరావు పాల్గొన్నారు.



కాజలో నిరసన



నిడమర్రులో నిరసన



ఉండవల్లిలో



దుగ్గిరాల మండలం చిలువూరులో



హలో కార్మిక.. చలో విశాఖ

సిఐటియు జాతీయ మహాసభ జయప్రదం కోసం ప్రచారం

ప్రజాశక్తి– తాడేపల్లి

సిఐటియు అఖిలభారత మహాసభలు జనవరి 4వ తేదీ విశాఖపట్నంలో జరుగుతున్న సందర్భంగా కార్మికుల పెద్ద ఎత్తున తరలిరావాలని, ప్రదర్శన బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం తాడేపల్లిలోని మునిసిపల్ మచ్చర పాయింట్ వద్ద మున్సిపల్ కార్మికుల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు రెండు సంవత్సరాలు నుండి నేటికీ కొబ్బరినూనె సబ్బులు ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. మున్సిపల్ కార్మికుల అనేక ఆందోళన ఫలితంగా పోరాడి సాధించుకున్న హక్కులను నేడు పాలకులు కాలరాస్తున్నారని మండిపడ్డారు. నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం ద్వారా కార్మిక వర్గంపై మరింత పని భారాన్ని పెంచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇది పెట్టుబడిదారులకు కార్పొరేట్ శక్తులకు కార్మికుల శ్రమను కారు చౌకగా దోచి పెట్టడానికి దోహదపడుతుందని తోడ్పడుతుందని చెప్పారు. దీన్ని తిప్పికొట్టేందుకే కార్మిక వర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు అఖిలభారత మహాసభలు ఆంధ్రప్రదేశ్లో మొట్టమొదటిసారిగా జరుగుతున్నందున, కార్మిక వర్గం యావన్మంది ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సతీషు, వెంగమ్మ,మేరీ, సువార్త, నాగేశ్వరరావు, కామాక్షి, శ్రీను, రాంబాబు పాల్గొన్నారు.



మిద్దె సెంటర్లో తెనాలి రోడ్డులో బాధితుల నిరసన

తెనాలి రోడ్డు విస్తరణ ఆపాలి

మిద్ది సెంటర్లో బాధితుల నిరసన

ప్రజాశక్తి – మంగళగిరి : మంగళగిరి పట్టణం తెనాలి రోడ్డులోని చేనేత వ్యాపారులు, నివాసితులు, అద్దెదారులు, కార్మికులు మిద్దె సెంటర్ వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. తెనాలి రోడ్డు విస్తరణ ఆపాలని బాధితుల కోరారు. తెనాలి రోడ్డు విస్తరణ బాధితులు మీడియాతో మాట్లాడుతూ మేము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, అభివృద్ధికి సహకరిస్తామని, అభివృద్ధిలో ప్రధాన భాగస్వా మ్యులైన తమకు ఉపాధి లేకుండా చేయవద్దని అవసరానికి మించి విస్తరణ వద్దని వేడుకున్నారు. టిడిఆర్ బాండ్లు వద్దని, దుకాణాలు, మా జీవనోపాధి, ఇళ్లు కావాలని విజ్ఞప్తి చేసారు. మమ్మల్ని సంప్రదించకుండా అభ్యంతరాలు తీసుకోకుండా గెజిట్ తీసుకురావడం అన్యాయమని అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా తీసుకువచ్చిన గెజిట్‌ను వెంటనే రద్దు చెయ్యాలని ఆవేదన వ్యక్తం చేసారు. తెనాలి రోడ్డును 60 అడుగులుగా విస్త రణ చేసినట్లయితే వందలాది కుటుంబాలవారు తమ జీవనో పాధిని కోల్పోయి రోడ్డున పడతారని, చాలా మంది పూర్తిగా నిరాశ్రయులు అవుతారని తెలిపారు. చేనేత పరిశ్రమ, ఇతర వ్యాపార సంస్థలకు అను బంధంగా పనిచేస్తున్న కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక మలుపులతో కూడిన తెనాలి రోడ్డు 60 అడుగుల విస్తరణకు అనుకూలం కాదని, కాబట్టి నగరపాలక సంస్థ వారు తెనాలి రోడ్డును వన్–వేగా చేసి, జాతీయ రహదారిని నేరుగా కలిపే ప్రత్యామ్నాయ మార్గాలను అభివృద్ధి చెయ్యాలని కోరారు. తెనాలి రోడ్డు చేనేత వ్యాపార పరిరక్షణ మరియు విస్తరణ బాధితుల సంఘం కో–కన్వీనర్ ఫణిదపు వీరాస్వామి మాట్లాడుతూ ఈ సమస్యను మంగళగిరి శాసనసభ్యులు, మంత్రి లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకోని తెనాలి రోడ్డుకు ఇరువైపులా జీవనం సాగిస్తున్న చేనేత వ్యాపారులు, చిరువ్యాపారస్తులు, అద్దెదారులు, కార్మికులు ఉపాధి కోల్పోకుండా, నిరాశ్రయులు కాకుండా మానవతాదృష్టితో ఆలోచించి అభివృద్ధి చేయాలని కోరారు.

పర్యావరణ కాలుష్య నియంత్రణ ప్రతిఒక్కరి బాధ్యత



ప్రజాశక్తి - వినుకొండ

జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో పట్టణంలోని శర్మ స్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. శానిటరీ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ వారంలో ఒకరోజైనా ప్రజలు తమ రోజు వారి విధులకు కార్లు లేదా మోటర్ సైకిల్ వాడకుండా సైకిల్ వాడాలని కోరారు. చెట్లను నాటాలని, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ బదులు జ్యూట్, గుడ్డ సంచులు వాడాలని, ఇంటి వద్ద తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని కోరారు. ప్రిన్సిపాల్ శర్మ మాట్లాడుతూ కాలుష్యానికి పరిశ్రమలు ప్రధాన కారణమని, ఏసీలు, ఫ్రిడ్జ్ వల్ల పర్యావరణ కాలుష్యం పెరుగుతోందని చెప్పారు. భావి తరాలకు మంచి వాతావరణం అందించడం మనందరి బాధ్యతన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా నరసరావుపేటలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్కూల్ చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాశరావు మాట్లాడుతూ 1984 డిసెంబర్ 2న భోపాల్‌లో వాటిల్లిన గ్యాస్ పేలుడు



ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వేల మందిని స్మరించుకుని కాలుష్య నివారణపై అవగాహన దినోత్సవం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇటువంటి చిన్న ప్రయత్నంతో పెద్ద మార్పులు సాధ్యమని, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన పెంపొందించడమే లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సబితా, ప్రిన్సిపాల్ రేఖ ఫులేకర్, ఎన్.సిసి కేర్‌టేకర్ ఎం.భూపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సహజ వనరులను మితంగా వాడుకోవాలని తిరుమల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణ అన్నారు. నరసరావుపేట మండలం జొన్నలగడ్డలోని తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవ అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. డాక్టర్ వైవి నారాయణ మాట్లాడుతూ పపంచం కాలుష్య నియంత్రణ దిశగా పోరాడుతోందని, ఇది ఏ ఒక్కరి ద్వారారో సాధ్యం కాదని, ప్రతి ఒక్కరూ కాలుష్య నివారణ తమ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. కాలుష్య నివారణతో భూమి వేడెక్కకుండా ఉంటుందని తద్వారా మానవులు, సకల జీవరాసులు మనుగడ సాధించగలుగుతాయని వివరించారు. కళాశాల సెక్రటరీ - కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం, వ్యర్థ జలాల వినియోగంతో కాలుష్యాన్ని నియంత్రించవచ్చన్నారు. క్లీన్ డెవలప్మెంట్ మెకానిజం ప్రాజెక్టు ద్వారా పట్టణ ప్రాంతాల్లో కాలుష్యం తగ్గించే అవకాశం ఉందని తెలిపారు. కాలుష్య నివారణపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు.

గృహ నిర్మాణ పథకానికి దరఖాస్తు గడువు పెంపు

ప్రజాశక్తి - కారంపూడి, రెంటచింతల

పిఎం ఆవాస్ యోజన- ఎన్టీఆర్ గీహ నిర్మాణ పథకం కొరకు దరఖాస్తు గడువును ఈనెల 14 వరకు పొడిగించినట్లు కారంపూడి, రెంటచింతల గృహ నిర్మాణ శాఖ ఏఈలు బాబురావు, సి.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. నూతన గృహం నిర్మాణం కోసం దరఖాస్తులను మండల కార్యాలయం లేదా సచివాలయాల్లో ఇవ్వాలని సూచించారు. సొంత ఇల్లు లేని పేద కుటుంబాలకు ఈ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందిస్తాయని తెలిపారు.



పల్నాడు బాలోత్సవంలో నారాయణ ఇంగ్లీష్ మీడియం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - యడ్లపాడు

నరసరావుపేటలో ఇటీవల నిర్వహించిన పల్నాడు జిల్లా బాలోత్సవం పోటీల్లో యడ్లపాడు విద్యార్థులు సత్తాచాటారు. స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ఏడు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. రంగోలి, సోలో సింగింగ్, మ్యాథ్స్ క్విజ్, మ్యూజికల్, మైమ్‌షో, స్టోరీటెల్లింగ్ సీనియర్, జూనియర్స్ విభాగాల్లో బహుమతులు పొందారని ప్రిన్సిపాల్ సిహెచ్.సృజన తెలిపారు. రంగోలిలో బి.భార్గవ శివలీల ప్రథమ బహుమతి, సోలో సింగింగ్‌లో షేక్ నూరేహీరా, మ్యూజికల్ పియానోలో సుజిత్, గణిత క్విజ్‌లో గోవిందరాజు, కల్యాణ్, లక్ష్మీకీర్తన, కథలు చెప్పడం (సీనియర్స్)లో బత్తుల సంజన ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారని, మైమ్ షోలో పృధ్వీ, రౌణక్ చౌదరి తృతీయ బహుమతులు, కథలు చెప్పడం (జూనియర్స్)లో లోకవర్షిత్ కన్సోలేషన్ బహుమతిని అందుకున్నారని వివరించారు. వీరిని పాఠశాల డైరెక్టర్ చిన్న మాస్టారు, కార్యదర్శి పోపూరి బ్రహ్మానందం, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడలతోనూ మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి-ఈపూరు

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించటం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థానాలు పొందవచ్చని బొగ్గరం గ్రామ సర్పంచ్ పొట్లూరి హైమావతి రాఘవులు అన్నారు. గ్రామంలోని జెడ్‌పి పాఠశాలలో 30 మంది బాలికలకు క్రీడా దుస్తులను ఆమె మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎం.రామారావు మాట్లాడుతూ నరసరావుపేటలో ఇటీవల జరిగిన బాలోత్సవాల్లో 60 మంది విద్యార్థులు వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రాలు అందుకున్నారన్నారు. అంతర్జాలంలో అన్వేషణ, సీనియర్స్ విభాగంలో గడిపూడి నరసింహ భార్గవ్ ప్రథమ బహుమతి, మెమొరీ టెస్ట్‌లో కొదమగుండ్ల శివఆర్యన్ ద్వితీయ బహుమతి, పసుపులేటి అఖిలేష్ తృతీయ బహుమతి గెలుపొందారన్నారు. సీనియర్స్, జూనియర్స్ విభాగంలో కోలాటం ప్రదర్శన, మైమ్, లఘు నాటిక, ఫోక్ డాన్స్‌లతో అద్భుతమైన ప్రదర్శనలు చేసి అలరించారన్నారు. బహుమతులు సాధించిన వారిని సర్పంచ్‌తోపాటు బాస్ చైర్మన్, సెక్రటరీ లింగా ఆంజనేయులు, పిఇటి ఎం.వెంకటేశ్వర్లు, ఎస్ఎంసి చైర్మన్ మేకల వెంకటరామయ్య అభినందించారు.



అపోలో టైర్స్‌లో 'తిరుమల' విద్యార్థులకు ఉద్యోగాలు

గత నెల 27 న విజయవాడ ఎన్.ఆర్.ఐ కళాశాలలో అపోలో టైర్స్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ విద్యార్థులు 10 మంది పాల్గొనగా ముగ్గురు ఉద్యోగాలు సాధించారని తిరుమల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవి నారాయణ తెలిపారు. ఎంపికైన వారిని వార్షిక వేతనం రూ.3 లక్షలు ఉంటుందన్నారు. వీరిని కళాశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, సెక్రటరీ - కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, టిపిఒ ఎం.సాంబశివరావు అభినందించారు.



రైతులకు విత్తన సంచులు ఇస్తున్న అధికారులు

అంతర, సరిహద్దు పంటలతో ఆదాయం, తెగుళ్ల నివారణ

ప్రజాశక్తి - పెదకూరపాడు

ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు పల్నాడు జిల్లా మేనేజర్ అమలకుమారి అన్నారు. 'రబీ డ్రై సోయింగ్ కిట్స్, 'సిటు సిడ్ అంతర పంటల విత్తన కిట్స్' తయారీ కార్యక్రమాన్ని స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమల కుమారి మాట్లాడుతూ ఖరీఫ్ ప్రధాన పంట పూర్తయిన తర్వాత భూమిని ఖాళీగా ఉంచకుండా, 22 రకాల విత్తనాలు (15 కేజీల కిట్) కలిగిన రబీ డ్రై సోయింగ్ వేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ విధానం వల్ల భూమి గుల్లబారి, పంటకు ఉపయోగపడే సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఆర్డీఎస్ వేయడం ద్వారా ఆకుకూరలు, కూరగాయల వంటి వాటినుంచి కూడా రైతులు ఆదాయం పొందవచ్చని చెప్పారు. ప్రధాన పంటలలో అంతర పంటలు విధిగా వేసుకోవాలన్నారు. మిర్చితో పాటు ఉల్లి, ధనియాలు, ముల్లంగి, బంతి, ఆముదం వంటి ఐదు రకాల అంతర పంటలు, సరిహద్దు పంటలుగా జొన్న, సజ్జ వేసుకోవాలని సూచించారు. దోమపోటు గుర్తించడానికి పసుపు, తెలుపు, బులుగు రంగుల జిగురు అట్టలు, లద్దెపురుగు గుర్తించడానికి లింగాకర్షణ బుట్టలు పెట్టుకోవాలన్నారు. మండల వ్యవసాయధికారి కృష్ణయ్య మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. రబీ డ్రై సోయింగ్ కిట్లను రైతు సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ ధనలక్ష్మి, ఎంపిడిఒ సాయిలీల, ఎంపిఎం జయరావు, ప్రకృతి వ్యవసాయ జిల్లా సిబ్బంది నందకుమార్, అభ్యుదయ రైతు అవార్డు గ్రహీత శేషారావు, మాస్టర్ ట్రైనర్ మధు, ఇంచార్జ్ అమూల్య, గ్రామ వ్యవసాయ సహాయకులు అనూష, హనుమాన్ నాయాక్, విధుష పాల్గొన్నారు.

రవికుమార్‌కు మరో పురస్కారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి : పట్టణానికి చెందిన పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్‌కు మోహిని ఈవెంట్స్, ట్రస్ట్, మరియు ఎల్‌సిఇఎస్ ఫౌండేషన్ వారి 'జాతీయ పౌరాణిక నట కళారత్న' పురస్కారాన్ని ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని నేషనల్ కల్చర్ సెంటర్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును రవికుమార్ అందుకున్నారు. రవికుమార్ పదేళ్ల నుండి విభిన్న, వైవిధ్య భరిత పౌరాణిక సాంఘిక, చారిత్రక పాత్రలు ధరించి రెండు తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులును రంజింపచేసినందుకుగాను అవార్డుకు ఎంపికయ్యారు. సన్మానించిన వారిలో ఎల్‌సిఇఎస్ ఫౌండేషన్ అధ్యక్షుడు కె.బుచ్చేశ్వరరావు, బుల్లి తెరనటి గంగా భవాని, నృత్యకారిణి షేక్ సిద్ధాభి, చంద్ర శేఖర్, గాయని కళా కారిణి హేమశ్రీలత ఉన్నారు.



విద్యుద్ఘాతంతో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి - విజయపురిసౌత్



విద్యుద్ఘాతంలో ఇల్లు దగ్ధమైన ఘటన విజయపురిసౌత్‌లో మంగళ వారం జరిగింది. తెల్లవారుజామున సుమారు 4.40 గంటలకు చల్లా రాజుకు చెందిన ఇంటికి మంటలు అంటుకున్నాయి. ఆ సమయంలో రాజు అయ్యప్ప దీక్షలో ఉండటం వలన కృష్ణానదికి స్నానం కోసం వెళ్లగా భార్య అంజలి ఇంట్లో నిద్రిస్తూ మంటలు అంటుకుని గాయపడ్డారు. ఆమెను ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో ఇంట్లో ఉన్న విలువైన సామాన్లు, వస్తువులు కొంతమేర బంగారం, నగదు దగ్ధమైనట్లు బాధిత కుటుంబీకులు తెలిపారు.

బకాయిలను త్వరగా వసూలు చేయాలి

ప్రజాశక్తి - దుర్గి

పెండింగ్‌లో ఉన్న బకాయిలను త్వరగా రికవరీ చేయాలని వెలుగు సిసిలకు ఎంపిఎం పి.వెంకటరంగారెడ్డి సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ పొదుపు గ్రూపు సభ్యులకు ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా అందించిన ఆర్థిక సాయాన్ని ఎలా ఉపయోగించుకుంటున్నారని అడిగారు. అక్టోబర్ నెలకు సంభందించి పిఎన్‌పిఎ కానీ, ఎన్‌పిఎ కానీ 20 శాతం కూడా రికవరీ కాలేదన్నారు. స్త్రీ నిధి రికవరీ చాలా తక్కువగా ఉందని, రెగ్యులర్ రికవరీలైనా ఈనెల 5వ తేదీలోపు జమ చేయించాలని ఆదేశించారు. సమీక్షలో సిసిలు నరేష్ రెడ్డి, శ్యాంసన్, లక్ష్మినాయక్, అంజినాయక్ పాల్గొన్నారు.



రెవెన్యూ సమస్యలపట్ల ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజాశక్తి-గుంటూరు

రెవెన్యూ సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) లో రెవెన్యూ అంశాలు పట్ల అందిన అర్జీలపై నియోజక వర్గం స్థాయిలో రెవెన్యూ నోడల్ అధికారులతో కలెక్టర్ కార్యాల యంలో మంగళవారం ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందిన ప్రతీ అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యపట్ల పూర్తి అవగాహన పొందాలన్నారు. పిజిఆర్ఎస్ నామమాత్రంగా నిర్వహించట్లేదని, ప్రతి ఒక్కరూ గ్రహించాలని స్పష్టం చేశారు. ఎస్ఎల్ఏ కాలపరిధి దాటకుండా సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. అర్జీదారునితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, తద్వారా మరల సమస్య వచ్చే అవకాశం ఉండదని తెలిపారు. ముందస్తుగా అర్జీదారులకు నోటీస్ జారీచేసి ప్రక్రియను నిబంధనలు మేరకు చేపట్టాలని అన్నారు. తహాశీల్దారులు సోమవారం అందుకున్న అర్జీల పట్ల శుక్రవారం నాటికి స్పష్టమైన సమాచారం కలిగి ఉండాలని చెప్పారు. రెవెన్యూ సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. బియ్యం కార్డు వంటి సేవా పరమైన అంశాలు వచ్చేటపుడు నేరుగా దరఖాస్తు చేసుకునే విధంగా అధికారులు సహకరించాలని సూచించారు. బియ్యం కార్డుకు వచ్చే దరఖాస్తులు పౌర సరఫరాల శాఖ పర్యవేక్షణ చేయాలని అన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా, జిల్లా రెవెన్యూ, డివిజనల్ అధికారులు ఎన్.ఎస్.కె.ఖాజా వలి, శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా

మహిళల విజ్ఞాపనలపై నిర్లక్ష్యం తగదు

మహిళా గ్రీవెన్స్ స్వీకరణలో అధికారులతో ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మహిళల నుంచి వస్తున్న విజ్ఞాపనలను తక్షణం పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు. మంగళవారం తన కార్యాలయంలో మహిళా గ్రీవెన్స్ డే నిర్వహించారు. మహిళల నుండి అర్జీలు స్వీకరించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ తాను ప్రతి మంగళవారం కార్యాలయంలో ఉండి మహిళల నుంచి ప్రత్యేకంగా విజ్ఞాపనలను తీసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్టు ఆయన వివరించారు. మహిళలు ఈ గ్రీవెన్స్ డే ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిలుపునిచ్చారు. అవసరమైన లబ్ధిదారులకు అందుబాటులో ఉండే విధంగా ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా గత ప్రభుత్వం అస్తవ్యస్తంగా ఇళ్ల స్థలాలను కేటాయించిందన్నారు. దీని వల్ల ఎక్కువ మంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతత్వంలో అందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాల పంపిణీని పూర్తి పారదర్శకంగా ఇవ్వటానికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.





విజేతలతో నజీనా బేగం, రామచంద్రరాజు తదితరులు

పర్యావరణ పరిరక్షణకు కృషి : నజీనా బేగం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కాలుష్యం బారిన పడకుండా ఎవరికి వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణా మండలి పర్యావరణ ఇంజినీరు ఎం.వి.నజీనా బేగం తెలిపారు. గుంటూరులోని భారతీయ విద్యాభవన్‌లో మంగళవారం జరిగిన జాతీయ కాలుష్య నిరోధక దినోత్సవ సభలో ఆమె మాట్లాడారు. గాలి, నీరు, నేల కాలుష్యం వల్ల కలిగే హానికర ప్రభావాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం కోసం ప్రతి ఏటా డిసెంబరు 2న ఈ దినోత్సవాన్ని నిర్వహిసు న్నట్టు తెలిపారు. విద్యా భవన్‌లో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. నజీనా బేగం మాట్లాడుతూ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకత, పర్యావరణంపై అవగాహనను ప్రదర్శిం చారని కొనియాడారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి చర్యలు ప్రతీ రోజూ ప్రతి ఒక్కరి జీవితంలో భాగమ వ్వాలని ఆమె సూచించారు. విద్యార్థులకు, ఉపాధ్యా యులకు, తల్లిదండ్రులకు ఈ దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. గాలి, నీరు, నేల కాలుష్యానికి కారణమయ్యే చర్యలను నివారించడం, పర్యావరణ చట్టాలను పాటించడం, పరిశ్రమల్లో పర్యావరణ సురక్షిత మార్గాలను అవలంబించడం అవసరమన్నారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి పి.రామచంద్రరాజు మాట్లాడుతూ మొక్కలు నాటడం విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలన్నారు. అలాగే భారతీయ విద్యా భవన్ విద్యాశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. హేమాబా మాట్లాడుతూ, విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం పెంచడం ఎంతో అవసరమన్నారు. పర్యావరణ పరిరక్షణ సమితి జిల్లా కోఆర్డినేటర్ డి.తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

364 రోజులుగా దీక్షలు చేస్తున్న సిమెంట్ కార్మికులు

ప్రజాశక్తి- తాడేపల్లి

చట్ట ప్రకారం తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు మంగళవారం నాటికి 364 రోజుకు చేరుకున్నాయి. దీక్షలలో చిట్టీమల్లపిచ్చయ్య, దామవరపునాగేశ్వరావు, ఎలగపాటియహోషువ, ముసలాసాంబశివరావు, బి సూర్యప్రకాష్ కూర్చున్నారు. దీక్షలను కార్మిక నాయకులు కూరపాటి స్టీవెన్, తుపాకుల నాగేశ్వరావు, బూరగ అంకయ్య, వైసాంబశివరావు, సుభాని, ఎమ్మెల నరసింహా రావు ప్రారంభించారు. కార్యక్రమం లో ఎంగురవయ్య, శివకుమారి, ఆర్ ఇశ్రాయిల్, దార్లశ్రీనివాసరావు, డి మాణిక్యారావు,కేహగ్గయ్య, సువర్ణ, శారదా, శారమ్మ, రమాదేవి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల కష్టపడి పనిచేసి, యాజమాన్యంకు కోట్లు సంపాదించి పెట్టిన, వారి నుండి కేవలం చట్టప్రకారం తమకు రావలసిన పరిహారం మాత్రమే ఆశిస్తున్నారని, పాలకవర్గ పార్టీలు ఎంతకాలం ఈ దారుణం కొనసాగిస్తారని ప్రశ్నించారు.

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో స్పాట్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి - తాడికొండ

ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరమునకు బైపిసి విభాగములో ఏపీ ఈఏపిసెట్ 2025 బిటెక్ బిఎస్సి. (హాన్స్) అగ్రికల్చర్ (ఫుడ్ టెక్నాలజీ)లో ప్రవేశాలకు ఆన్లైన్ లో రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులకు చివరి విడత మాన్యువల్ కౌన్సిలింగ్ ఈ నెల 3, 4 తేదీలలో మరియు స్పాట్ కౌన్సిలింగ్ ఈ నెల 5 వ తేదీన జరుగునని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవి రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాల కొరకు యూనివర్సిటీ వెబ్ సైట్ angrau.ac.in ను సంప్రదించాలని అయన తెలిపారు.



డాక్టర్ రాజకుమారిని అభినందిస్తున్న కాలేజి డైరెక్టర్

మహిళలపై హింసకు వ్యతిరేకంగా అభ్యుదయ కాలేజీలో అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

అభ్యుదయ మహిళా డిగ్రీ కాలేజిలో నో టు వైలెన్స్ ఎగనెస్ట్ ఉమెన్ కమిటీ, ఎఫ్‌డిజిఎస్ఐ అనే కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శనక్కాయల రాజకుమారి పాల్గొని మహిళల భద్రతకు సంబంధించిన పలు కీలక అంశాలను విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా డొమెస్టిక్ వైలెన్స్, సోషల్ మీడియా సైబర్ సెక్యూరిటీ, ఆన్‌లైన్ ఫ్రెండ్‌షిప్ వల్ల ఎదురయ్యే మోసాలు, అవసరంలేని లింకుల ప్రమాదం, డిజిటల్ అబ్యూస్ వంటి సమస్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు కోర్టు అడ్వకేట్ సరిత పాల్గొని వర్బల్ అబ్యూస్, ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ విభాగం అందించే సేవలు, సమస్యలు వచ్చినప్పుడు సంబంధిత అధికారులను సంప్రదించే విధానం గురించి మార్గనిర్దేశం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.రోహిణి, యాజమాన్యం పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి- తాడేపల్లి

నిత్యం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ, వారిని బావి భారత పౌరులుగా తీర్చిదిస్తున్న ఉపాధ్యాయులు మంగళవారం తాము సైతం అంటూ ఆటల పోటీలకు దిగారు. పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మహిళా ఉపాధ్యాయులకు త్రో బాల్ పోటీలు, పురుష ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ ఆటల పోటీలును తెనాలి డివిజన్ ఇంచార్జ్ డిప్యూటీ డిఇఓ జి. శాంత కుమారి , ఎం ఈ ఓ డి. నాగేశ్వరరావు స్కూల్ ప్రధానోపాధ్యాయులు జి.అనంత శివ ప్రారంభించినారు. కార్యక్రమంలో తాడేపల్లి మండలానికి సెలెక్ట్ అయినటువంటి త్రో బాల్ మరియు క్రికెట్ టీముల ఉపాధ్యా యని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వడ్డేశ్వరం జడ్‌పి హైస్కూల్‌కు 30 ట్యాబ్‌లు అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హై స్కూల్‌కు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో 30 డిజిటల్ ట్యాబ్‌లను మంగళవారం టిడిపి నాయకులు ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రాజశేఖర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్పకు అందజేశారు. పాఠశాలలో డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్ ఆవిష్కరణ సందర్భంగా విద్యార్థులకు విజ్ఞానం పెంపొందించుకునేందుకు ఈ ట్యాబ్ లను నాయకులు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాట్రగడ్డ మధుసూధనరావు, హైస్కూల్ స్థల దాత బచ్చు లక్ష్మీనారాయణ, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ షేక్ బషీరున్, టిడిపి నాయకులు షేక్ మస్తాన్, ఇమాంస, గ్రామ సచివాలయ అసిస్టెంట్ షేక్ మస్తాన్ వలి, పాల్గొన్నారు.

నేటి నుండి గ్రామసభలు

ప్రజాశక్తి - దుగ్గిరాల : మండలంలో బుధవారం నుండి స్వామిత్వ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు తెలిపారు. మూడో తేదీ గొడ వర్రు నాలుగో తేదీ పెద్ద కొండూరు పేరుకలపూడి ఐదో తేదీ దుగ్గిరాల చుక్కపల్లి వారి పాలెం ఆరవ తేదీ పెనుమూలి ఈమని చిలువూరు గ్రామాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి - తెనాలి

పురపాలక సంఘం పరిధిలో 37వ వార్డులో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య పనులను కమిషనర్ జె రామ అప్పల నాయుడు పరిశీలించారు. సైడు కాలువలలో పేరుకుపోయిన వ్యర్థాలు, వాటిని తొలగించేందుకు పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్న విధానంపై వారికి కొన్ని సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు కార్మికులు కృషి చేస్తున్నారని, ప్రజలకు అసౌకర్యం లేకుండా చూస్తామని చెప్పారు. అదే సమయంలో ప్రజలు కూడా పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని, వ్యర్థాలను రోడ్ల పైన, కాలువలలో వేయరాదని చెప్పారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ సెక్రటరీలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

రైతుసేవ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని తక్కెళ్ళపాడు రైతు సేవ కేంద్రం నుండి మంగళవారం వరి ధాన్యం సేకరణలో భాగంగా మొట్టమొదటి ధాన్యం లోడును భార్గవ సాయి రైస్ మిల్లు నకు పంపించారు. తక్కెళ్ళపాడు గ్రామ రైతుకు సంబంధించిన 38 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని గుంటూరు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎన్.మోహన్ రావు, పెదకాకాని తహశీల్దార్ కృష్ణకాంత్ పర్యవేక్షణలో పంపించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి రమణ కుమార్ తెలిపారు. రైతులు ప్రభుత్వానికి ధాన్యాన్ని అమ్మదలుచుకుంటే 17శాతం తేమ తగ్గకుండా చూసుకోవాలన్నారు, కార్యక్రమంలో స్థానిక మండల నాయకులు మల్లికార్జున రావు,తదితరులు పాల్గొన్నారు.

నేడు అగ్రిగోల్డ్ బాధితుల 'ఆవేదన యాత్ర'

ప్రజాశక్తి - తెనాలి

అగ్రిగోల్డ్ బాధితులు బుధవారం విజయవాడలో చేపట్టిన ఆవేదన యాత్రను జయప్రదం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు షేక్ బషీర్ పిలుపునిచ్చారు. స్థానిక గాంధీ నగర్ లోని సిపిఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పది సంవత్సరాలుగా వేలాదిమంది కస్టమర్లు, డిపాజిటర్లు మానసిక వేదనకు గురవుతున్నారని, ఎన్నికలకు ముందు అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఇప్పుడు వారిని విస్మరించిందని ఆరోపించారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ విజయవాడ కళాక్షేత్రం నుంచి ధర్నా చౌక్ వరకు నిర్వహించే బాధితుల ఆవేదన యాత్రను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జి వెంకటేశ్వరరావు, ఎల్ శ్రీనివాసరావు, రఫీ, కే సుధాకర్ పాల్గొన్నారు.

ఉన్నది ఒకటే కుళాయి కనెక్షన్

రికార్డుల్లో రెండు కనెక్షన్‌లుగా నమోదు

సమస్య పరిష్కరించాలని కమిషనర్ అలీం బాషాకు వినతి

ప్రజాశక్తి - మంగళగిరి

తన నివాస గృహానికి సంబంధించిన తాగునీటి కుళాయి కనెక్షన్ సమస్యను పరిష్కరించాలని నగరంలోని కొత్తపేటకు చెందిన ఎండీ సలీమ్ మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ అలీం బాషాకు వినతిపత్రం మంగళవారం అందజేశారు. నగరంలోని కొత్తపేటలో ఉన్న తన నివాస గృహానికి వాస్తవానికి ఒకే ఒక్క తాగునీటి కుళాయి కనెక్షన్ (అసెస్ మెంట్ నెంబరు: 1023000642) ఉందని, కానీ నగరపాలక సంస్థ రికార్డుల్లో తనకు రెండు తాగునీటి కుళాయి కనెక్షన్లు ఉన్నట్లు తప్పుగా నమోదు చేశారని తెలిపారు. గత ఎనిమిది సంవత్సరాలుగా ఈ సమస్య ఉండటంతో తాగునీటి కుళాయి పన్ను కూడా చెల్లించుకోవడం లేదని తెలిపారు. అదనంగా నమోదైన కుళాయి కనెక్షన్ రద్దు చేసి వాస్తవంగా ఉన్న తాగునీటి కుళాయి కనెక్షన్‌కు సంబంధించి బిల్లు చెల్లిస్తామని చెబుతుంటే సచివాలయ అధికారులు మాత్రం రెండు కుళాయి కనెక్షన్లకు సంబంధించిన బిల్లు చెల్లించాల్సిందేనని చెబుతున్నారని తెలిపారు. అదనంగా నమోదు చేసిన తాగునీటి కుళాయి కనెక్షన్ ను రద్దు చేయాలని సచివాలయం, నగరపాలక సంస్థ కార్యాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇటువంటి సమస్య నగరపాలక సంస్థ పరిధి లో మరి కొందరికి కూడా ఉన్నట్లు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. అదనపు తాగునీటి కుళాయి కనెక్షన్ రద్దు చేయకపోవడం కారణంగా ఇంటి పన్ను పేరు మార్చుకోవడం కూడా వీలుపడక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. కావున ఇప్పటికైనా రికార్డుల్లో తప్పుగా నమోదైన అదనపు కుళాయి కనెక్షన్ ను రద్దు చేసి సమస్యను పరిష్కరించాలని కమిషనర్ అలీం బాషాను కోరారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు పోస్టింగ్ ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు వెంటనే శిక్షణ ఇచ్చి పోస్టింగ్స్ ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్ ఒక ప్రకటనలో కోరారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, పోటీలకు ఎంపికై రెండు నెలల నుండి శిక్షణ, పోస్టింగ్స్ కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. 2022 నవంబర్‌లో విడుదలైన నోటిఫికేషన్ ప్రక్రియ ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. ఈవెంట్స్, రాత పరీక్షలు, వైద్య పరీక్షలు పూర్తి అయి, పరీక్షలకు ఎంపిక పూర్తి అయిన తర్వాత కూడా పోస్టింగ్స్‌లో జాప్యం తగదన్నారు. అభ్యర్థులు పోస్టింగ్‌ల కోసం ఎదురు చూస్తూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని నిరూపించుకోవాలని, తక్షణమే శిక్షణ ఇచ్చి పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డి.వై.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

చలపతిలో వ్యక్తిత్వ వికాస శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు


ట్రైనర్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రముఖ ట్రైనర్ పి.శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు మొదటి సంవత్సరం నుండే తమ జీవితానికి అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని, సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకోవాలని, చిన్న చిన్న విషయాలకు ఇతరులపై ఆధారపడకూడదని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆశావహ దృక్పథంతో ఉండాలన్నారు. సెల్‌ఫోన్‌ను మితంగా ఉపయోగించాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు విద్యార్థుల అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో బేసిక్ విభాగాధిపతి డాక్టర్ ఎ.రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కెఎల్‌పి స్కూల్లో కంప్యూటర్ సాక్షరత దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు


కంప్యూటర్ ఎక్స్‌పోను పరిశీలిస్తున్న సెక్రెటరీ

స్థానిక జెకెసి కాలేజీ రోడ్డు లోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో మంగళవారం ప్రపంచ కంప్యూటర్ సాక్షరత దినోత్స వం, కాలుష్య నివారణ దినో త్సవం నిర్వహించారు. పాఠశాల సెక్రెటరీ, కరస్పాండె ంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఆధునిక యుగంలో కంప్యూటర్ ప్రాధాన్యతను వివరించారు. కంప్యూటర్ విద్య చదువులో భాగం మాత్రమే కాదని, జీవిత నైపుణ్యం అని, సాంకేతికత మన చేతుల్లో ఉండే మంత్రదండం లాంటిదన్నారు. దీని ప్రాధాన్యత దృష్ట్యా పాఠశాల తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ప్రిన్సిపాల్ జి.రత్తయ్య మాట్లాడుతూ 2001 నుండి కంప్యూటర్ సాక్షరత దినం ప్రారంభం అయ్యిందని, దేశంలో దీనిని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వారు ప్రారంభించారని అన్నారు. భోపాల్ గ్యాస్ దుర్ఘటన దృష్ట్యా జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం నిర్వహించుటమని చెప్పారు. జల, వాయు, భూ కాలుష్యాలను తగ్గించటంలో విద్యార్థులు అందరూ భాగస్వామ్యం కావాలని అన్నారు. అకడమిక్ కోఆర్డినేటర్ బి.శైలజ మాట్లాడుతూ కంప్యూటర్ సాంకేతికత పరిజ్ఞానం అనేది ఉద్యోగం కోసం కాదని, ఉన్నతికి దోహదపడుతుందన్నారు.


గుంటూరు తూర్పు, పశ్చిమ, రూరల్ కమిటీతో కెఎస్ లక్ష్మణరావు, ఇతర నాయకులు

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

యుటిఎఫ్ గుంటూరు నగర తూర్పు, పశ్చిమ మహాసభల్లో కెఎస్ లక్ష్మణరావు - నూతన కమిటీలు ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయటానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. యుటిఎఫ్ గుంటూరు నగర శాఖ నూతన కమిటీ ఎన్నిక మంగళవారం బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో యుటిఎఫ్ ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై రాష్ట్రంలో రాజీలేని పోరాటం చేసేది యుటిఎఫ్ సంఘం అని తెలిపారు. ఎంఇఒ కార్యాలయంలో, ట్రెజరీలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్‌ను బలోపేతం చేసుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యు.రాజశేఖర్‌రావు అన్నారు. గుంటూరు నగర తూర్పు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.వెంకటేశ్వరరావు, షేక్.రెహమాన్, పశ్చిమ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.వి.శివరామిరెడ్డి, బి.నరసింహారావు, గుంటూరు రూరల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మరియన్న, షేక్.బాజీబాబ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి.ప్రసాద్, ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, కె.రంగారావు, షేక్.షకీలాబేగం, డి.చంద్రశేఖర్, ఎం.కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో చిన్నారుల వికాసానికి బాటలు

ప్రజాశక్తి-గుంటూరు

ఆటా పాటలతో చిన్నారుల వికాసానికి బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. గుంటూరు నగరంలోని వాసవినగర్ మోడల్ ఫౌండేషన్ స్కూల్‌ను జిల్లా కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫౌండేషన్ స్కూల్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రంతో సహ ఐదవ తరగతి వరకు ఉన్న అన్ని తరగతులను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల ఎత్తు, బరువులను స్వయంగా పరిశీలించారు. ఆటా పాటలతో, బోధన పరికరాలతో చిన్నారులకు బోధించే విధానాన్ని తనిఖీ చేసి ప్రతిరోజు ఆహ్లాదకర వాతావరణంలో చిన్నారుల మానసిక వికాసానికి తోడ్పడే విధంగా ఉండాలన్నారు. ఫౌండేషన్ స్థాయిలోనే నైతిక విలువలతో కూడిన ఉన్నత ఆలోచనలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. ఏ ఒక్క చిన్నారి తక్కువ బరువు, ఎత్తు కలిగి ఉండరాదని, పౌష్టికాహారం అందించడం, నిర్దేశిత ప్రమాణాలు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. ఒకటి నుండి ఐదవ తరగతి వరకు ఉన్న అన్ని తరగతులను పరిశీలించారు. విద్యార్థులకు కొన్ని ప్రశ్నలు వేసి విద్యా ప్రమాణాలు తనిఖీ చేశారు. విద్యార్థులకు నిర్వహించే పరీక్షల విధానాన్ని పరిశీలించారు. తానే ఉపాధ్యాయునిగా మారి మూడవ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉత్తమ బోధనకు ఉపాధ్యాయులు కట్టుబడి ఉండాలని చెప్పారు. ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని, సమాజం నడవడికను తీర్చిదిద్దుటకు, మార్గదర్శకం ఇచ్చుటకు ఒక సాధనం అన్నారు. గుణాత్మక విద్యను అందించాలని సూచించారు. చిన్నారులకు తయారు చేస్తున్న ఆహారాన్ని తనిఖీ చేశారు. మెనూ పక్కాగా అమలు చేయాలని ఆదేశిం చారు. మరుగుదొడ్ల నిర్వహణ, పాఠశాల పరిశుభ్రతలో రాజీ పడరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి సి.వి. రేణుక, ఉప విద్యా శాఖ అధికారి వెంకటేశ్వర రావు, తహసిల్దార్ సుభాని పాల్గొన్నారు.

మోడల్ ఫౌండేషన్ స్కూల్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా

కుట్టు శిక్షణ ద్వారా మహిళలకు స్వయం ఉపాధి

మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - పెదనందిపాడు


కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మణరావు తదితరులు

కుట్టు శిక్షణ పొందడం ద్వారా మహిళలకు స్వయం ఉపాధి లభిస్తుందని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. మంగళవారం తెళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో, నాట్స్ వారి సహాయంతో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రంలో 5వ బ్యాచ్‌ని పారిశ్రామిక వేత్త దాసరి శేషగిరిరావు, నూతి సుబ్బారావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు తెళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ మహిళలు ఈ కుట్టు శిక్షణ పొందడం ద్వారా స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకుని ఎదగాలని అన్నారు. కుట్టు శిక్షణతో పాటు కంప్యూటర్ శిక్షణ కూడా ఏర్పాటు చేయాలని విజ్ఞాన కేంద్రం నిర్వాహకులను కోరారు. గత నెలలో ఎస్.ఎమ్.ఎమ్.ఎస్.పుస్తకాలను కూడా ఈ విజ్ఞాన కేంద్రంలో నాట్స్ వారి సహాయంతో పెదనందిపాడు, కాకుమాను మండలాల విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. విజ్ఞాన కేంద్రం ప్రారంభించిన మూడు సంవత్సరాల లోనే వంద మందికి పైగా మహిళలకు కుట్టు శిక్షణ అందించిన విజ్ఞాన కేంద్రం నిర్వాహకుల కృషిని అభినందించారు. విజ్ఞాన కేంద్రం బహుముఖ కార్యక్రమాల ద్వారా పేద ప్రజలకు, విద్యార్థులకు, కార్మికులకు ఉపయోగపడాలని కోరారు. పారిశ్రామిక వేత్త దాసరి శేషగిరిరావు మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రం చేసే ప్రతి కార్యక్రమానికి తమ వంతు సహాయసహకారాలు అందిస్తామని అన్నారు. కుట్టు శిక్షణ ను మహిళలు సద్వినియోగ పరచుకోవాలని అన్నారు. స్థానిక పి.ఎ.ఎస్. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రం వీరరాఘవయ్య మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రం వారికి అన్ని కార్యక్రమాలలో తోడుగా ఉంటామని, ప్రజలకు ఉపయోగపడేలా పలు కార్యక్రమాలు నిర్వహించడం మంచి విషయం అని అన్నారు. విశ్రాంత టీచర్ మక్కెన జవహర్ రాణి మాట్లాడుతూ మహిళల కోసం కుట్టు శిక్షణ ఏర్పాటు చేయడం వలన వారికి చేయూతగా ఉంటుందని అన్నారు. గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రాలు పలువురి పేర్లతో పెదనందిపాడుతో పాటు రాష్ట్రంలో తాడేపల్లి, గుంటూరు, ఒంగోలు, యడ్లపాడు, విజయవాడ, నెల్లూరు, విశాఖపట్నం, నరసరావుపేట లాంటి పలు చోట్ల నడుస్తున్నాయని , వాటి ద్వారా పేద ప్రజలకు, విద్యార్థులకు , కార్మికులకు ఉపయోగపడే పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాబోయే కాలంలో ట్యూషన్ సెంటర్స్, లెక్కలు, ఇంగ్లీషులో విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇప్పించేందుకు ప్రయత్నం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసి యేషన్ నాయకులు నూర్ భాషా సుభాని సాహెబ్, విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల కన్వీనర్ జంపని రామారావు, నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, ఫణిదపు భువనేశ్వరి, మర్రి లక్ష్మి, కాపు వెంకట సుబ్బారావు, కుట్టు శిక్షణ టీచర్ కొర్రపాటి లక్ష్మి, అన్నలదాసు ఆశీర్వాదం, గోలి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

స్కిట్ ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



సెయింట్ ఆన్స్‌లో కంప్యూటర్ లిటరసీ దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కాలేజీలో వరల్డ్ కంప్యూటర్ లిటరసీ డే నిర్వహించారు. నేటి ఆధునిక డిజిటల్ యుగంలో కంప్యూటర్ నిరక్షరాస్య తను పారదోలి అందరికీ కంప్యూటర్ వాడకంపై అవగా హన కల్పించాల్సిన అవసరం ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ సంధ్య.టి అన్నారు. ఈ సందరంగా కాలేజ్ నుండి గోరంట్ల వరకు నిర్వహించిన ర్యాలీని ప్రిన్సిపాల్ ప్రారంభి ంచారు. అనంతరం గోరంట్లలోని మండల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కంప్యూటర్ విద్య పట్ల అవగాహనకు స్కిట్ ప్రదర్శించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డి.స్వర్ణచరణి రాయ్, అధ్యాపకులు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణతోనే ప్రజల ఆరోగ్యం

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నారాకోడూరు సెంటర్‌లో కమ్యూ నిటీ అవుట్‌రీచ్ కార్యక్ర మాన్ని నిర్వహించారు. 'పొల్యూషన్ ప్రివెన్షన్ సేఫ్ ఎన్విరాన్‌మెంట్'అనే అంశంపై ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని 'సస్టైనబుల్ లివింగ్ ఫర్ గ్రీనర్ ఫ్యూచర్' అనే థీమ్‌తో నిర్వహించామని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. వీసీ మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. జీవనశైలిలో చిన్నచిన్న మార్పులు చేసుకోవటం ద్వారా పచ్చని భవిష్యత్తును నిర్మించవచ్చని అన్నారు. వనరుల అధిక వినియోగం, ప్లాస్టిక్ కాలుష్యం, పరిశ్రమల పెరుగుదల వలన పర్యావరణానికి తీవ్రమైన నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సస్టెయినబుల్ లివింగ్ అంటే అవసరమైనంత మాత్రమే వనరులను వాడుతూ, పునర్వినియోగం, రీసైక్లింగ్ వంటి పద్ధతులను అమలు చేయడం ద్వారా రాబోయే తరాలకు భూమి సంపదలను కాపాడాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.